శాస్త్రిపురం పై ఓవర్ ప్రారంభం



# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం, 18 ఏప్రిల్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

## జాతీయ విపత్తును నివారించిన రోజు



- రాహుల్ నేతృత్వంలో విపక్షాలు ఐక్యత చాటాయి
- ఇందుకు సహకరించిన విపక్ష నేతలకు కృతజ్ఞతలు
- ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన సింఎం రేవంత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 : ఇవాళ జాతీయ విపత్తును నివారించిన రోజు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్షాలు కలిసి జాతీయ విపత్తును నివారించాయన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జాతీయ విపత్తును అడ్డుకున్నారు. దేశ చరిత్రలో సువర్ణదినంగా ఇవాళ గుర్తుండిపోతుంది. నల్ల బిల్లులను ఓడించేందుకు ఏకమైన మిత్రపక్షాల నేతలకు ధన్యవాదాలు అని రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. లోక్‌సభలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. విపక్ష నేతలందరూ ఏకమై ఒక 'జాతీయ విపత్తును' నివారించారని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన సందేశంలో ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావించారు. భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చిరస్థాయిగా నిలిచిపోయే

## కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ జైన్‌తో చర్చించాం
- వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న సింఎం మేడిగడ్డను పరిశీలిస్తారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 17: కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ

మిగతా 3లో..

## పదేళ్లు అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు

- ఇప్పుడే పాదయాత్ర చేయాలని ఎందుకనో
- కెటిఆర్‌పై విమర్శలు గుప్పించిన కవిత
- ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని నిదీస్తాం
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, ఏప్రిల్ 17: పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. పాదయాత్ర చేస్తానని మాజీ మంత్రి కేటీఆర్ (×ªTF) ఇప్పుడు ఎందుకు అంటున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆయన ఎందుకు ప్రజల్లోకి పోలేదని నిలదీశారు.ప్రజా సమస్యలను పరిష్కరించేది అధికార పార్టీనేనని..

మిగతా 3లో..

## సిగాచీ బాధితులను నట్టేట ముంచారు



- కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సింఎం
- మరోమారు మండిపడ్డ హరీష్ రావు

మిగతా 2..

# మనస్సాక్షిగా మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

- 2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి
- లేదా కొత్తగా మహిళా బిల్లును తీసుకుని రండి
- బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల క్రూర చర్య
- చర్చలో మోడీ ఓ మెజీషియన్ అంటూ రా హుల్ తీవ్రంగా విమర్శలు
- రాహుల్ తీరుపై మండిపడ్డ స్పీకర్ బిర్లా..కేంద్రమంత్రులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 : ఇప్పటికే 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు. ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత



ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళా బిల్లు ముసుగులో దేశ

మిగతా 3లో..

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం



### లోయలో పడ్డ వ్యాన్: పదిమంది దుర్మరణం

చెన్నై,ఏప్రిల్17 : తమిళనాడులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాన్ లోయలో పడ్డ ఘటనలో 10 మంది చనిపోగా.. మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. కోయంబత్తూరు జిల్లాలోని వాల్పరై ఘాట్ రోడ్డులో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పింది. వేగంగా వెళ్లి

మిగతా 3లో..

## తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

- కిషన్ రెడ్డిని కోరిన మంత్రి పొన్నం
- లోక్‌సభలో మాట్లాడిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేం
- మంత్రి పొన్నం లేఖపై డిజిపి శివధర్ రెడ్డి స్పష్టీకరణ

మిగతా 2లో..

## రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం

- బ్రిటన్ పౌరసత్వం కలిగి ఉన్నట్లు ఆరోపణలు
- విచారణకు ఆదేశించిన అలహాబాద్ హైకోర్టు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 : ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయా లని అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ జరపా లని అక్కడి లఖ్‌నవూ బెంచ్ ఉత్తర్వు లిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహిం చాలని లేదంటే.. ఒక కేంద్ర దర్యాప్తు

## విపక్షాల తీరుపై మహిళా ఎంపిల ఆందోళన

- నిరసనగా పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన



న్యూఢిల్లీ,ఏప్రిల్17 : మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం అత్యంత దారుణమని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఇదొక చీకటి రోజని, బిల్లును వ్యతిరేకించిన వారికి చీకటి రోజులు దగ్గర పడ్డట్టేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో మహిళా ఎంపిలు ఆందోళనకు దిగారు. విపక్ష పార్టీల తీరుపై మండిపడ్డారు. మహిళలకు రిజర్వేషన్లు రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన సంగతి తెలిసిందే. ఓటింగ్

## సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆర్టిజన్లు

- విద్యుత్ శాఖ ఆర్టిజన్ల జేపీసీ చైర్మన్ సతీష్ రెడ్డి
- సింఎండితో చర్చలకు ఆదేశించిన డిప్యూటీ సీఎం



హైదరాబాద్,ఏప్రిల్17 : ట్రాన్స్కో సీఎండి తో మా సమస్యల పై చర్చించేందుకు డిప్యూటీ సీఎం ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేపీసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్ లో ఆర్టిజన్ల జేపీసీ నాయకులు డిప్యూటీ

# వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం
- అనుకూలంగా 278.. వ్యతిరేకంగా 211 ఓట్లు
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 : మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూట మి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూ లంగా కలసి రాలేదు. రాజ్యాంగ

# ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

- హోర్ముజ్ జలసంధి తెరిచి ఉంటుందని ప్రకటన
- ఇరాన్ ప్రకటనతో భారీగా తగ్గిన ఆయిల్ ధరలు



టెహ్రాన్,ఏప్రిల్17 : ప్రపంచానికి ఇరాన్ శుభవార్త అందించింది. హోర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచినట్లు ప్రకటించింది. ఇజ్రాయిల్, లెబనాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు అమాంతంగా పడిపోయాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ రవాణాకు కీలకంగా మారిన హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పంద కాలం ముగిసేవరకూ హోర్ముజ్ పూర్తిగా తెరిచి ఉంటుందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇరాన్ తాజా ప్రకటనతో.. హోర్ముజ్ జలసంధిలో ఇకపై అన్ని వాణిజ్య నౌకలకు ప్రవేశం ఉంటుంది. అంతర్జాతీయ వాణిజ్య రవాణాకు కీలకమైన ఈ జలమార్గంలో వాణిజ్య నౌకల ప్రయాణాలకు మార్గం సుగమమైంది. ఇరాన్, ఇతర దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే ఈ జలమార్గంపై..

# మనస్సాక్షిగా మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

- మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో పెద్ద అవకాశం
- మహిళలను గౌరవించేందుకు సమిష్టిగా కృషి చేద్దాం
- ఎంపిలంలకు ప్రధాని మోడీ పిలుపు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతివ్వాలని ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యులంతా తమ మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో గొప్ప అవకాశమని ఆయన కొనియాడారు. మహిళలకు తగిన హక్కులను కల్పించడంలో అందరం సమష్టిగా చరిత్ర సృష్టించాలన్నారు. ఏకాభిప్రాయంతో ఈ సవరణను ఆమోదించాలని, దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఎక్స్ వేదికగా ప్రధాని కోరారు. 'నేను ఎంపీలందరినీ కోరేది ఒక్కటే.. మీ ఇంట్లోని తల్లిని, సోదరిని, కుమార్తెను, భార్యను గుర్తుంచుకుని..మీ మనస్సాక్షి చెప్పిందే వినండి. దేశ మహిళలకు సాధికారత కల్పించడం అనేది ఒక గొప్ప అవకాశం. వారికి కొత్త అవకాశాలను దూరం చేయకండి. ఈ సవరణ ఏకాభిప్రాయంతో ఆమోదం పొందితే..దేశంలోమహిళా శక్తి మరింత బలోపేతమవుతుంది. ఫలితంగా.. దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. రండి.. ఈ రోజు మనమందరం కలిసి చరిత్ర సృష్టిద్దాం' అని మోదీ పిలుపునిచ్చారు. మహిళలకు వారి హక్కులు ఇచ్చేందుకు సమయం ఆసన్నమైందని అంతకముందు జరిగిన చర్చ సందర్భంగా మోదీ ప్రసంగించారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు చేసిన సవరణలపై పార్లమెంటులో సవివరమైన, సుదీర్ఘ రీతిలో చర్చ జరుగుతోందన్నారు. ఇప్పటివరకు జరిగిన చర్చలో సదరు బిల్లుపై ఉన్న అపోహలను తొలగించామని, సభ్యుల సందేహాలన్నింటినీ నివృతి చేశామని ఆయన తెలిపారు. ఇది చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య అని, దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్‌ను రాజకీయం చేశారని, నిర్ణయాలు తీసుకునే పక్రియలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఈ బిల్లు లోక్‌సభలో ఓటింగ్‌కు రానున్న నేపథ్యంలో ఎంపీలంతా సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు మోదీ. సభ్యులు సున్నితంగా వ్యవహరించాలని, 'నారీ శక్తి' మనోభావాలను దెబ్బతీయవద్దని కోరారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు సవరణలు చేసే విషయంపై పార్లమెంట్‌లోచర్చ జరుగుతోంది. నిన్న రాత్రి ఒంటిగంట వరకు చర్చ నడిచింది. బిల్లుల విషయంలో ఉన్న అపోహలను తొలగించేలా ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. నాలుగు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎన్నో రాజకీయాలు జరిగాయి. దేశ జనాభాలో సగ భాగంగా ఉన్నవారు తమ హక్కులను పొందడానికి సమయం ఆసన్నమైంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నిర్ణయాలు తీసుకునే పక్రియలో వారికి ప్రాతినిధ్యం లేకపోవడం సరికాదు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు నా విన్నపం ఒక్కటే. పూర్తి పరిశీలన తర్వాత మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకొని ఓటు వేయండి' అని ప్రధాని కోరారు. మహిళా శక్తికి సేవచేయడానికి, వారిని గౌరవించేందుకు ఇదొక అద్భుత అవకాశం. మహిళలకు కొత్త అవకాశాలను దూరం చేయొద్దు. చరిత్ర సృష్టించేందుకు ఈ రోజు మనమంతా ఏకమవుదాం' అని 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.

# 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** 2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సిఎం రేవంత్, మంతంరి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిమాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం. ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం.కేంద్రం నుంచి తెలంగాణకు రూ.1,400 కోట్లురావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటే షన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయి లో వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలు వురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.

# ఆనాడు కులగణను ఎందుకు వ్యతిరేకించారు

- ఏప్రిల్ 17 కాంగ్రెస్ ఏమేం చేసిందో గుర్తు చేసుకోవాలి
- రాహులు వ్యాఖ్యలపై మండిపడ్డ నిశికాంత్ దుబె



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై జార్ఖండ్ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె విమర్శలు గుప్పి ంచారు. కులగణనను కాంగ్రెస్ గతంలో వ్యతిరేకించిందన్నారు. కులాల ఆధారంగా జనగణన దేశాన్ని విభజిస్తుందని నాడు హస్తం పార్టీ వాదించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, లేకపోయినా కులగణన నిర్వహణ ఎప్పటికీ సాధ్యం కాదని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఇక ఏప్రిల్ 17 గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై విమర్శనాస్త్రాలు సంధించారు నిషికాంత్. 'ఏప్రిల్ 17 గురించి రాహుల్ గొప్పగా చెబుతున్నారు. 1987లో బోఫోర్స్ కుంభకోణంవెలుగుచూసింది ఆరోజేగా.అదే రోజునే సీతారామ్ కేసరి నుంచి సోనియా గాంధీ పదవి లాక్కున్నారు. 1999లో వాజ్‌పేయి ప్రభుత్వాన్ని కాం గ్రెస్ పడగొట్టింది కూడా ఇదే తారీఖునే. మహిళలకు రిజర్వేషన్లు ఇస్తుంటే రాహుల్ తట్టుకోలేకపోతు న్నారు. రాహుల్ ప్రసంగం పీసీ సర్కార్ మ్యాజిక్ షోలా సాగింది. మహిళా బిల్లు గురించి రాహుల్ మాట్లాడలేదు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు' అని నిషికాంత్ దూబె అన్నారు.

# రొటేషన్‌లో మహిళలకు ప్రధాని పదవి

### కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సూచన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :** మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ లోక్‌సభలో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 2002లో డీలిమిటేషన్ చేశారు. ప్రస్తుతం మనం 2026లో ఉన్నాం. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేస్తామంటున్నారు. 15 ఏళ్లు గడిచిపోయింది. దీనిపై ప్రజలకు ఎలా న్యాయం చేస్తారు. మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. కానీ, ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో లింక్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వానికి నేను కొన్ని సూచనలు చేస్తున్నా. మంత్రిత్వ శాఖలో మహిళలకు 50 శాతం రిజర్వ్ చేయాలి. ప్రధాని పదవిని కూడా రొటేషన్ పద్ధతిలో మహిళలకు రిజర్వ్ చేయాలి. ఎందుకంటే 2029 ఎన్నికల్లో భాజపా అధికారంలోకి రాదని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

# సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

### మరోమారు మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్, ఏప్రిల్ 17:** సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శి ంచారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయకకార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మం త్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మృతదేహాల సాక్షి గా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తా మని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమనిప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ.29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధి తులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పు కుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబ ద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకునిఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం,యాజమాన్య అమానవీయ తకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారం లోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమా దంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుం బాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదని హరీశ్‌రావు తెలిపారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు.

# శాస్త్రిపురం ఫ్లై ఓవర్ ప్రారంభం





### ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 17:** హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక అడుగు పడింది. నగరంలో మరో ఆర్‌వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారం భించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ 71 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. సుమారు 490 మీటర్ల పొడవుతో, నాలుగు లైన్లలో ఫ్లై ఓవర్ జీహెచ్‌ఎంసీ నిర్మించింది. జీహెచ్‌ఎంసీ, సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. శాస్త్రిపురం ఫ్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో మైలార్ దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం అయింది. ఉద్ద మ్‌గడ్డ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పడనుంది. ప్రయాణ సమయం కూడా చాలా వరకు తగ్గనుంది. ఫ్లై ఓవర్ ద్వారా మైలార్‌దేవ్‌పల్లి, వట్టెపల్లి, ఫలక్‌నుమా, ఆర్టీసీ బస్ డిపో ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడింది.

# రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మూలా

- ఉత్తరాది, దక్షిణ్యాది పేరుతో విషం చిమ్ముతున్నారు
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ పక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తు న్నాయని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతి రేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు. దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకునరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారని అన్నారు.

# తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

- లోక్‌సభలో మాట్లాడిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేం
- మంత్రి పొన్నం లేఖపై డిజిపి శివధర్ రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 17:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించే విధంగా భాజపా ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు లోక్‌సభ స్పీకర్‌ను ఒప్పించాలని ఆయన కోరారు. ఎంపీ విషయంలో చర్యలు తీసుకోవా లంటూ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డికి మంత్రి లేఖ రాశారు. ఈ లేఖపై డీజీపీ స్పందించారు. చట్టసభల్లో మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉండదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని మంత్రి మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై చర్చలో ఎంపీ తేజస్వి సూర్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనను ప్రస్తావిస్తూ.. బ్రిటీష్ వాళ్లు చేసిన భారత్- పాకిస్తాన్ విభజనకంటే దారుణంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరే చేశారంటూ ఎంపీ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి.

# తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

### మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడు తున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండి పడ్డారు. రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. అలాంటి రేవంత్ కుఏబినేట్‌లో ఉన్న పొన్నం తదితరులు గతాన్ని మరిచి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. ఒక్క ఓటు, రెండు రాష్ట్రాలు అనే నినాదానికి కట్టుబడి, రాష్ట్ర విభజనకు మద్దతు ఇచ్చింది బీజేపీ అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కావాలని అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

# తేజస్వీ వ్యాఖ్యలు..పార్లమెంట్ ముందు ఎంపిల నిరసన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 :** పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని బైఠాయించారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ భాజపా ఎంపీ తేజస్వీ సూర్య లోక్‌సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అవమానించవద్దని ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా కూడా ఎంపీలు నినాదాలు చేశారు. ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, వేం నరేందర ÷- రెడ్డి, కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.


# పేరు, ఫోటో వాడకుండా చూడండి

- ఢిల్లీ కోర్టులో అల్లు అర్జున్ కేసు

**న్యూఢిల్లీ,ఏప్రిల్17:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండా ఆయన పేరు, ఫొటో, వాయిస్‌లను ఎవరూ వాడకూడదని కోరుతూ.. ఒక పిటీషన్ దాఖలు చేశారు. తన పేరు, ఫోటోలను ఉపయోగించుకుని పలు ఉత్పత్తులను విక్రయిస్తూ డబ్బు సంపాదించుకుంటూ తన ప్రతిష్ఠను దెబ్బతీసేలా చేస్తున్న వారికి ఈ కేసు వర్తిస్తుందని, తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోరుతూ ఢిల్లీ హైకోర్టులో అల్లు అర్జున్ దావా వేశారు. శుక్రవారం జస్టిస్ తుషార్ రావు కమిటీ నేతృత్వంలో ఈ కేసు విచారణకు రానుంది. ఇదే అంశంలో ఇప్పటికే చిరంజీవి, మోహన్‌లాల్, నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్, పవన్ కల్యాణ్, ఐశ్వర్యరాయ్, తమ వ్యక్తిత్వ హక్కులను కాపాడాలంటూ కోర్టును కోరిన సంగతి విదితమే. ఈ కేసులలో సినీ ప్రముఖుల ప్రైవసీ హక్కులను రక్షించకపోతే వారికి సరిదిద్దలేని నష్టం జరుగుతుందని న్యాయస్థానం స్పష్టం చేస్తూ తీర్పు ఇచ్చింది.

# కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణ

- బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు



**హైదరాబాద్, ఏప్రిల్ 17:** కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రుతుపవనాలకుముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలని తెలంగాణ సర్కార్ సూచించింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్‌ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

balagamtv100@gmail.com

# కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

(మొదటిపేజీ తరువాయి)

బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం



చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# పదేళ్లు ప్రజలను ఎందుకు కలవలేదు

(మొదటిపేజీ తరువాయి)

అందుకే కాం గ్రెస్‌ను టార్గెట్ చేశానని కవిత తెలిపారు. ఆయా సమ స్యల ఆధారంగా బీఆర్ఎస్‌పైన కూడా మాట్లాడుతానని అన్నారు. పరిగిలో రైతు దీక్షకు మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి.. హరీశ్‌రావు హౌస్ అరెస్ట్ అయ్యా రని తెలిపారు. ఆ సమయంలో హరీశ్‌రావు ఫోన్ చేస్తే పోలీసులు ఆయన ఇంటికి వచ్చి హౌస్ అరెస్ట్ చేశారని విమర్శించారు. హరీశ్‌రావు పరిగిదాకా కూడా పోలేదని ఎద్దేవా చేశారు. తాము పరిగి వెళ్లి రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నామని స్పష్టం చేశారు. పోలీసులు తమను అరెస్టు చేశారని.. రైతులకు మద్దతుగా తాము నిలిచామని తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఏ విధంగానైతే పోరాటం చేశామో...అదే విధంగా పరిగిలో కూడా పోరాటం చేశానని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా పోరాటం చేస్తానని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో అన్నివర్గాలకు అధికారం రావాలన్నదే తన ధ్యేయమని వ్యాఖ్యానించారు. అందరికీ అధికారమని మాట్లాడుతారని.. దీనిని ఆచరణలోకి తీసుకురావాలని తాను ప్రారంభించాకే తనకు కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ఇచ్చారని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో కవితను పలువురు కలిశారు. ఆమెను కలిసిన వారిలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు ఉన్నారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ప్రతి కష్టాన్ని పాఠంగా భావిస్తూ.. సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు. సర్వోదయ తెలంగాణ తన లక్ష్యమని.. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. మారోజు వీరన్న అనుచరుల మద్దతు ఎంతో శక్తిని ఇస్తుందని అన్నారు. తమతో మారోజు వీరన్న అనుచరులు కలవటమంటే ఇక తమను ఆపే శక్తే లేదని పేర్కొన్నారు. ఏదైనా శని ఉంటే.. అది తొలగిపోవడం కోసమే తాను వారణాసి వెళ్లి పూజలు చేశానని ప్రస్తావించారు. తాను పెట్టే పార్టీ సక్సెస్ కావాలని కోరుకున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనను కలిశారని.. పేర్లు మాత్రం తాను బయటకు చెప్పనని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్‌ను ముందుగా టార్గెట్ చేశానని తెలిపారు. తనను ఆ పార్టీ సస్పెండ్ చేసిందని కవిత ప్రస్తావించారు.

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

లోయలో పడిపోయింది. పైనుంచి కిందపడ్డంతో వ్యాన్ నుజ్జునుజ్జయింది. వ్యానులో ఉన్న పది మంది అక్కడికక్కడే చనిపోయారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు 10 మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై వేగంగా దూసుకు వెళుతున్న కారు టైర్ పేలింది. ఒక్కసారిగా అదుపుతప్పిన కారు.. వేగంగా వెళ్లి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు వేగంగా కారుకు వ్యాపించాయి. కారు, బస్సు మంటల్లో దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరు మంది కాలి బూడిదయ్యారు. బస్సులో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి.

# రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం

(మొదటిపేజీ తరువాయి)

సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలం టూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన భాజపా కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంత కాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరు డిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘిం చడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి కూడా లేఖ రాశారు. మరోవైపు, రాహుల్ గాంధీ పౌరసత్వానికి సంబంధించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు. ఈ క్రమంలోనే న్యాయస్థానాలను ఆశ్రయించారు. పౌరసత్వానికి సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదంటూ లఖ్‌నవూలోని ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు గతంలో శిశిర్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దాంతో అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

## ఎంపిల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియలో 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 మంది ఓటు వేశారు. దీంతో మెజారిటీకి అవసరమైన 352 మంది సభ్యుల బలం లేకపోవడంతో బిల్లు వీగిపోయినట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. దీంతో డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026ను వెనక్కి తీసుకున్నట్టు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవటంపై డీకే అరుణ మాట్లాడుతూ.. ' రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని ప్రధాని మోదీ సభా వేదికగా వివరించారు. మహిళా రిజర్వేషన్ల పట్ల ఇండియా కూటమికి చెందిన వారికి చిత్తశుద్ధి లేదు. గ్రామాల్లో కాంగ్రెస్ దాని మిత్రపక్షాల వైఖరిని ప్రజలకు వివరిస్తాం. రాజకీయ లబ్ధి కోసమే మహిళలను వాడుకుంటున్నారు' అంటూ మండిపడ్డారు.

# సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆర్టిజన్లు

(మొదటిపేజీ తరువాయి)



సీఎంతో సమావేశమ య్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించిన డిప్యూటీ సీఎంకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు ప్రకటించారు. ఉద్యోగులు ప్రజలను మెప్పించే పనులు చేయాలి, సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసి, వేసవిలో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో ఉంటుంది ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సీఎం తెలిపారు. చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు చేస్తుంది, వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని జేఏసీ నాయకులకు డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించగలిగే సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్కో సిఎండి చర్చలు జరుపుతారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. చర్చల్లో ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆర్టిజన్ల కో చైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ విపత్తును నివారించిన రోజు

(మొదటిపేజీ తరువాయి)

ఒక మరపురాని రోజని సీఎం అభివర్ణించారు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడంపై రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతే ఈ విజయాన్ని సాధించిందని తెలిపారు. ఈ బిల్లులను 'నల్ల బిల్లులు'గా పేర్కొంటూ.. వీటిని ఓడించేందుకు కఠిన పరిస్థితుల్లోనూ సాహసంతో నిలబడినందుకు విపక్ష కూటమిలోని మిత్రపక్షాల నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోరాటంలో అండగా నిలిచిన దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులందరినీ సీఎం రేవంత్ రెడ్డి పేరుపేరునా ప్రస్తావించారు. వీరిలో ఎం.కే. స్టాలిన్ తమిళనాడు, మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్, అఖిలేశ్ యాదవ్, ఉత్తర్ ప్రదేశ్ శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే (మహారాష్ట్ర), లాలు ప్రసాద్ యాదవ్ బిహార్ ,హేమంత్ సోరెన్ జార్ఖండ్, అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ వీరితో పాటు ఫరూఖ్ అబ్దుల్లా, నవీన్ పట్నాయక్, కమ్యూనిస్ట్ పార్టీల నాయకులకు కూడా ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రకటన జాతీయ రాజకీయాల్లో తెలంగాణ పోషిస్తున్న క్రియాశీలక పాత్రను స్పష్టం చేస్తోంది. ఈ బిల్లు వీగిపోవడం కేంద్ర ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బగా విపక్షాలు భావిస్తున్నాయి. దక్షిణాది నుంచి రేవంత్ రెడ్డి జాతీయ స్థాయి మిత్రపక్షల నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమవ్వడం శుభ పరిణామమని సీఎం అభిప్రాయపడ్డారు. ఇదిలావుంటే భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా.. ఢిల్లీలోని అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతిగా సేవలందించారన్నారు. భారతదేశం గర్వించదగ్గ గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

# తేజస్వీ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ సీరియస్

- ఢిల్లీలో ఫిర్యాదు చేసిన మాజీమంత్రి శ్రీనివాసగౌడ్



న్యూఢిల్లీ,ఏప్రిల్17 : బీజేపీ యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంటులో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతున్నాయి. తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై ఆయన ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేసారు. లోక్‌సభ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తేజస్వి సూర్య చిక్కుల్లో పడ్డారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆయనపై ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదు నమోదైంది. ఈ సందర్భంగా ఆయన ఎంపీ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ విభజన ప్రక్రియను పాకిస్థాన్ ఏర్పాటుతో లేదా దేశ విభజనతో పోల్చడం అత్యంత హేయమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వందలాది మంది బలిదానాలు, దశాబ్దాల పోరాటం తర్వాత సిద్ధించిన తెలంగాణను ఇలా అవమానించడం రాష్ట్ర ప్రజల భావాలను గాయపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు వేదికగా ఓ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ఓ రాష్ట్రం పట్ల ఇంతటి వివక్షతో మాట్లాడటం సరికాదని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్యపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ పోలీసులను కోరారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఓ చారిత్రక ఘట్టాన్ని తక్కువ చేసి చూపడం రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. 'తెలంగాణ అంటే పోరాటాల గడ్డ' అని.. అలాంటి పవిత్రమైన ఉద్యమ ఫలితాన్ని పాకిస్థాన్‌తో పోల్చడం తేజస్వి సూర్య అజ్ఞానానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. ఆయన వెంటనే తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో కూడా ఎంపీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

# మనస్సాక్షిగా మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)



రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకురండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోందన్నారు. కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోందని, విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయని రాహుల్ గాంధీ అన్నారు. న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం వంటి కీలక రంగాల్లో ఓబీసీలు, దళితులు ఎక్కడున్నారు? దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో వీరు ఎక్కడున్నారు? ఓబీసీలకు అధికారం,భాగస్వామ్యం ఇచ్చేందుకు భాజపా సిద్ధంగా లేదు. తన ప్రాబల్యం తగ్గిపోతోందన్న భయం ఆ పార్టీకి పట్టుకుంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలను భాజపా గౌరవించడం లేదని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మోదీని పరోక్షంగా ఇంద్రజాలికుడంటూ రాహుల్ వ్యాఖ్యానిం చడం సభలో గందరగోళానికి కారణమైంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా.. భాజపా సభ్యులు కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. ప్రధానమంత్రిని అవమానిస్తున్నారని, ఇందుకు రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశంలో కుల గణన డిమాండ్‌ను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి కూడా తెలుసు. వాళ్లంత తెలివతక్కువ వాళ్లు కాదు. ఈ బిల్లును విపక్షంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తారని వాళ్లకు తెలుసు. అయినా ప్రధాని రెండు సందేశాలు పంపాలనుకున్నారు. ఇందులో మొదటిది.. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను ఆయన మార్చాలను కున్నారు. రెండవది.. తాను మహిళా పక్షపాతినని మరోసారి చాటిచెప్పాలని అనుకున్నారు. బాలాకోట్ మెజిషియన్, డీమోనిటైజేషన్ మెజియన్, సిందూర్ మెజిషియన్ అకస్మాత్తుగా పట్టుబడ్డారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రిని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానిపై అభ్యంతరకరమైన భాష వాడటాన్ని తప్పుపట్టారు. బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్ ప్రస్తావనతో దేశాన్ని, మిలటరీని అవమానపరుస్తున్నారని అన్నారు. దేశ ప్రధానమంత్రి గురించి విపక్ష నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, ఆ వ్యాఖ్యాలను రికార్డులను నుంచి తొలగించాలని స్పీకర్ ఓం బిర్లాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించారు.

# ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని నెలలుగా వివా దాలు కొనసాగుతున్నప్పటికీ, కాల్పుల విరమణ సమయం ముగిసేవరకూ.. యథావిధిగా వాణిజ్య రవాణా కొనసా గించవచ్చని ఇరాన్ స్పష్టం చేసింది. కాగా.. హోర్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సుమారు 20 శాతం ప్రపంచ క్రూడాయిల్ సరఫరా అవుతుందన్న విషయం తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడ డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగను న్నాయని తెలిపారు. ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది.

డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది.

# వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

(మొదటిపేజీ తరువాయి)



సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్ సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందా లంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గట్టెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోదీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

# బిజెపి ఎంపిలకు మూడు లైన్ల విప్ జారీ

### ఢిల్లీలోనే ఉండాలని ఆదేశం

న్యూఢిల్లీ,ఏప్రిల్17:పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లుపై కౌంటింగ్ సందర్భంగా బీజేపీ ఎంపీలకు మూడు లైన్ల విప్ జారీ చేసింది పార్టీ అధిష్ఠానం. ఎంపీలంతా తప్పనిసరిగాహాజరుకావాలని ఆదేశించింది. ఈవిప్ ద్వారా బెంగాల్, తమిళనాడు ఎన్నికల ప్రచారంలో ఉన్న సభ్యులను కూడా ఢిల్లీకి రప్పించినట్టు తెలుస్తోంది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కీలక బిల్లుల ఆమోదం కోసం హైకమాండ్ అన్ని ఏర్పాట్లు చేసినట్టు సమాచారం. బీజేపీ ఎంపీలందరూ తప్పనిసరిగా పార్లమెంట్ ప్రత్యేక సమావే శాలకు హాజరుకావాలని'త్రీ-లైన్ విప్'లో పేర్కొంది హైక మాండ్. ప్రభుత్వం కొన్ని కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించే అవకాశం ఉన్నందున..సభ్యులంతాసభకు హాజరై ప్రభుత్వానికి మద్దతు తెలపాలంది. కేంద్ర మంత్రులతో సహా ఎంపీలందరూ సభలోనే ఉండాలని, ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేసింది.

# మద్యం కేసులో వాసుదేవరెడ్డికి బెయిల్

విజయవాడ,ఏప్రిల్17:ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఏ2 నిందితుడు వాసుదేవ రెడ్డికి ఏసీబీ కోర్టు శుక్రవారం)బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. 2, 4 సోమవారాల్లో విచారణ అధికారుల ఎదుట హాజరవ్వాలని, పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని, లక్ష చొప్పున ఇద్దరు పూచీకత్తులు ఇవ్వాలని ఆదేశించింది. ఇదే కేసులో మరో నిందితుడు ప్రణయ్ ప్రకాశ్ బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు డిస్మిస్ చేసింది. ఇదే కేసులో మరో ముగ్గురు నిందితులు ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్ప, కృష్ణమోహన్ రెడ్డిల రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ పూర్తి చేసింది. ఈ తీర్పును ఏప్రిల్ 24వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది.

# రాష్ట్రంలో ఎక్సైజ్ పాలసీలో మార్పులు

- ప్రజలకు నాణ్యమైన మద్యం సరఫరా
- జగన్ హయాంలో కల్తీ మద్యానికి 30వేల మంది మృతి
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



గుంటూరు,ఏప్రిల్17 : రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం నియంత్రణ, నాణ్యత విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో నాసిరకం మద్యం సేవించి అనేక మంది అనారోగ్యానికి గురయ్యారని, దాదాపు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. జగన్ రెడ్డి పాలనలో సరైన బ్రాండ్లు అందుబాటులో లేక ప్రజలు ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చుకుని తాగాల్సి వచ్చిందని విమర్శించారు. దేశంలోనే అతిపెద్ద మద్యం స్కామ్ వైసీపీ ప్రభుత్వంలోనే జరిగిందని, దాదాపు రూ.3,500 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, చిత్తూరు ప్రాంతాల్లో అత్యాధునిక ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. మద్యం నాణ్యతను పరీక్షించి, ప్రజలకు హానికరంగా ఉన్న బ్రాండ్లను పూర్తిగా తొలగించినట్లు చెప్పారు. ప్రజలు విచ్చలవిడిగా మద్యం సేవించకుండా ఉండేందుకు వైన్ షాపుల్లో ప్రత్యేక గదుల (రూమ్) అనుమతులు కూడా ఇచ్చామని మంత్రి వివరించారు. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా మద్యం విధానంలో మరిన్ని మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.




# సమ్మె విరమించిన విద్యుత్ ఆర్టిజన్లు

- **ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో చర్చలకు మార్గం**

**బలగం టీవీ, హైదరాబాద్**

విద్యుత్ శాఖ ఆర్టిజన్లు సంయుక్త చర్య సమితి సమ్మెను విరమిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు సతీష్ రెడ్డి ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ప్రసార సంస్థాధిపతితో చర్చలు జరగనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో సమితి నాయకులు ఉప ముఖ్యమంత్రిని కలిశారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి చర్చలకు అవకాశం కల్పించినందుకు ఆయనకు సమితి కన్వీనర్ సాయిలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఉద్యోగులు ప్రజలను మెప్పించే విధంగా పనిచేయాలని సూచించారు. వేసవి కాలంలో విద్యుత్ అవసరం ఎక్కువగా ఉండే సమయంలో సమ్మెకు వెళ్లడం సరైంది కాదని అన్నారు. సమస్యలకు చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని, ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తుందని తెలిపారు. విద్యుత్ సంఘాల నాయకులు ఎప్పుడైనా చర్చలకు రావచ్చని, సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని హామీ ఇచ్చారు. ఆర్థిక భారం లేకుండా



పరిష్కరించగల అంశాలపై ప్రసార సంస్థాధిపతి ఖతీఅంష్ట్రఖు దీష్ఘుంఖుతీ ఆధ్వర్యంలో చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యుడు అద్దంకి దయాకర్, సమితి నాయకులు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, సంతోష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుంది



- **ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**
- **తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్**

**బలగం టీవీ, హైదరాబాద్**

హుజురాబాద్‌లో నాలుగు జిల్లాల చెత్తను తరలించి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నిర్ణయం ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే చర్య అని విమర్శించారు. డంపింగ్ యార్డ్ వల్ల గాలి, నీరు, భూమి కాలుష్యానికి గురై ప్రజల జీవితం దెబ్బతింటుందని, వ్యవసాయం నాశనం అవుతుందని, తాగునీరు కలుషితం అవుతుందని హెచ్చరించారు. ప్రజల అభిప్రాయం లేకుండా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

డంపింగ్ యార్డ్ విషయంలో తాను ఎలాంటి రాజీకి రానని స్పష్టం చేసిన నేపథ్యంలో తనపై తప్పుడు కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల కోసం చేస్తున్న పోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని, అవసరమైతే ప్రాణాలర్పించడానికైనా సిద్ధమని తెలిపారు. ఈ అంశంపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, మాజీ మంత్రి ఈటల రాజేందర్ స్పందించకపోవడాన్ని ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై స్పందించకుండా మౌనంగా ఉండటం సరికాదని అన్నారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా నిలవాలని పిలుపునిస్తూ, ఈ నెల 22న పాదయాత్ర నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. డంపింగ్ యార్డ్ ప్రతిపాదన పూర్తిగా రద్దయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బండ శ్రీనివాస్, తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, గందె శ్రీనివాస్, పింగిల్ రమేష్, తక్కళ్లపల్లి సత్యనారాయణరావు, తిరుపతి రావు, చుక్కా రంజిత్, సురేందర్ రెడ్డి, రవీందర్ రావు, బచ్చు శివశంకర్, దొడ్డె మమత తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలు పరిష్కరించాలి: బీఆర్‌టీయూ డిమాండ్

- **ఆర్టీసీ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన రాంబాబు యాదవ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో కార్మిక వర్గాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో సంక్షేమం తగ్గిపోయి సమ్మెల కాలం ప్రారంభమైందని విమర్శించారు. ఈ నెల 22న ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్తామని నోటీసు ఇచ్చిన నేపథ్యంలో, వారి పోరాటానికి బీఆర్‌టీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కార్మికులు ఐక్యంగా నిలిచి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ శాఖ శిల్పులు కూడా సమ్మెలో ఉండి పలు ప్రాంతాల్లో దీక్షలు నిర్వహిస్తున్నారని, వారికి కూడా మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిపోయిందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో కార్మికులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని, బీమా వంటి సౌకర్యాలు కల్పించారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్యలను తప్పుబట్టారు.

ఈ సందర్భంగా బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి మారయ్య మాట్లాడుతూ, కార్మికులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం జరుగుతున్న సమ్మెలకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను బేషరతుగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య దిష్టిబొమ్మ దహనం

- **క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేతల డిమాండ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

లోక్‌సభలో తెలంగాణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ భవన్ సమీపంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తేజస్వి సూర్య దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొని "ఖబడ్దార్ బీజేపీ ఎంపీలు", "డౌన్ డౌన్ బీజేపీ" అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణను పాకిస్తాన్‌తో పోల్చడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం అని అన్నారు. దేశంలోనే తెలంగాణను ముందంజలో నిలిపిన నాయకుడు కేసీఆర్ అని, రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. వెంటనే తేజస్వి సూర్య క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కిషోర్ గౌడ్ మాట్లాడుతూ, పార్లమెంట్ వంటి గౌరవనీయ వేదికపై తెలంగాణను దేశ విభజనతో పోల్చడం సిగ్గుచేటు అని అన్నారు. తెలంగాణ కోసం జరిగిన పోరాటాలను అవమానించేలా మాట్లాడటం తగదని, ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతమైతే భవిష్యత్తులో బీజేపీని తెలంగాణలో బహిష్కరిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని దేశ విభజనతో పోల్చడం దుర్మార్గమని పేర్కొన్నారు. తేజస్వి సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో బీజేపీ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ సభతో రేవంత్ రెడ్డి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి

- **కేసీఆర్ సభను డైవర్ట్ చేయడానికే మేడిగడ్డ సందర్శన**
- **రేవంత్ ది దిగజారుడు రాజకీయం**
- **కాళేశ్వరాన్ని కావాలనే ఎండబెట్టి రైతుల పొట్ట కొట్టారు..**
- **కాలమే రేవంత్ కు బుద్ధి చెబుతుంది**
- **కేసీఆర్ రాకతో తెలంగాణ రాజకీయాల్లో నూతన అధ్యాయం..**
- **జగిత్యాల సభను విజయవంతం చేయాలి**
- **మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

**బలగం టీవి, జగిత్యాల**

ఈ నెల 20వ తేదీన జగిత్యాలలో జరగబోయే భారత రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గారి బహిరంగ సభ ఏర్పాట్లను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి గారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి భయం అదే రోజు పర్యటనతో తేలిపోయింది."జగిత్యాలలో కేసీఆర్ గారి సభ ప్రకటించినప్పటి నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అందుకే ఈ సభను డైవర్ట్ చేయడానికి, అదే రోజున మేడిగడ్డ సందర్శన అని, అక్కడ మీటింగ్ అని డ్రామాలు ఆడుతున్నారు. ఒక సర్పంచ్, కౌన్సిలర్ కంటే తక్కువ స్థాయిలో ఆలోచిస్తూ ఇటువంటి సంకుంచిత బుద్ధితో రాజకీయాలు చేయడం రేవంత్ రెడ్డికే చెల్లింది. ఇది ఆయన దిగజారుడు రాజకీయాలకు ఇది పరాకాష్ఠ" అని మండిపడ్డారు.

నిన్నటి దాకా కాళేశ్వరం కూలిపోయింది అన్న రేవంత్ రెడ్డి, ఇవాళ మళ్లీ అక్కడికే వెళ్లి మరమ్మతులు చేస్తామంటున్నారు. కేసీఆర్ గారిని బద్నాం చేయాలనే దురుద్దేశంతో, కావాలనే రెండున్నరేళ్లుగా కాళేశ్వరాన్ని ఎండబెట్టి తెలంగాణ రైతాంగానికి అన్యాయం చేశారు. నాలుగు పంటలకు నీళ్లు అందకుండా చేసి రైతుల పొట్ట కొట్టారు. కేసీఆర్ గారి సభకు వస్తున్న ప్రజల స్పందన చూసి ఓర్వలేకనే ఇటువంటి చీప్ పాలిటిక్స్ చేస్తున్నారు అని విమర్శించారు.

"జగిత్యాల జిల్లా పార్టీ అధ్యక్షులు విద్యాసాగర్ రావు గారి ఆధ్వర్యంలో, జెడ్పీ ఛైర్మన్ దావ వసంత గారు, కొప్పుల ఈశ్వర్ గారు, ఎల్. రమణ గారు మరియు జిల్లా నాయకత్వమంతా కలిసి సభను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున సభకు వచ్చే ప్రజల కోసం మంచినీరు, మజ్జిగ మరియు పార్కింగ్ వంటి అన్ని వసతులను సిద్ధం చేశాం. కేసీఆర్ గారి స్థాయికి ఈ మైదానం చిన్నదైనప్పటికీ, ప్రజల ఉత్సాహం ముందు ఏదీ అడ్డుకాదు." అన్నారు

"తెలంగాణ సమాజం మొత్తం ఇప్పుడు ఒక్కటే కోరుకుంటోంది.. రేవంత్ రెడ్డి పోవాలి, కేసీఆర్ మళ్ళీ రావాలి. జగిత్యాల సభ ఈ రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పు తీసుకురాబోతోంది. కేసీఆర్ గారిని చూడటానికి, ఆయన మాట వినడానికి ప్రజలు వేలాదిగా తరలివస్తున్నారు. ఈ సభ విజయవంతమై కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి పునాది వేస్తుంది" అని వేముల ప్రశాంత్ రెడ్డి గారు స్పష్టం చేశారు. ఈ



కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, బాలమల్లు, శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

**రైతులపై కేసులు పెట్టడం నిరంకుశత్వం: వేముల ప్రశాంత్ రెడ్డి**

రుణమాఫీ చేయాలని కోరినందుకు కమ్మర్పల్లి బీఆర్ఎస్ నాయకులు, రైతులపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బాల్కొండ నియోజకవర్గంలో 52 వేల మంది రైతులకు రుణమాఫీ వర్తించాల్సి ఉండగా, కేవలం 22 వేల మందికే అమలు చేసి మిగిలిన 30 వేల మంది రైతులను విస్మరించడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. అందరికీ రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు కమ్మర్పల్లి బీఆర్ఎస్ నాయకులు, రైతులపై కేసులు నమోదు చేసి గత రెండేళ్లుగా కోర్టుల చుట్టూ తిప్పించడం బాధాకరమని విమర్శించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ కోర్టులో జరిగిన విచారణకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు, రైతులకు న్యాయం చేయాలని, ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వాటిని నెరవేర్చాలని ప్రశ్నించిన వారిపైనే కేసులు పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని వెల్లడిస్తోందని ఆయన అన్నారు. తక్షణమే రైతులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని, రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని, రైతులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను నిలిపివేయాలని వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# కేపీహెచ్‌బీలో బస్సులో మంటలు

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ నుంచి పాలకొల్లు వెళ్తున్న శ్రీ దుర్గ ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు బస్సులో శుక్రవారం మంటలు చెలరేగాయి. ఈ ఘటన నగరంలోని కేపిహెచ్‌బీ బస్ స్టాప్ సమీపంలో తబ్లా రెస్టారెంట్ వద్ద చోటుచేసుకుంది. కేపీహెచ్‌బీ సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బస్సులో సుమారు 18 మంది ప్రయాణికులు ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి వెంటనే బస్సును ఆపి ప్రయాణికులను దిగిపోవాలని సూచించడంతో అందరూ సమయానికి బయటకు వచ్చి ప్రాణాపాయం నుంచి తప్పించు కున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, ప్రయాణికు లంతా క్షేమంగా ఉన్నారని పోలీసులు తెలిపారు. ప్రయాణికులు తమ వ్యక్తిగత సామానులను కూడా సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్టు వెల్లడించారు..సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిప్రమాదం కారణంగా కొంతసేపు రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగినా, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి రాకపోకలను సాధారణ స్థితికి తీసుకువచ్చారు.ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ పరీక్ష రద్దు

- **ఏప్రిల్ 27న మళ్లీ నిర్వహణ**

**బలగం టీవి, హైదరాబాద్**

వరంగల్‌లోని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ జనరల్ సర్జరీ పేపర్-1 పరీక్షను రద్దు చేసింది. ఈ మేరకు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ వై. మల్లేశ్వర్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. విశ్వవిద్యాలయం 2026 ఫిబ్రవరి 9న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఏప్రిల్ 15న నిర్వహించిన ఈ పరీక్షలో సాంకేతిక సమస్యలు తలెత్తిన నేపథ్యంలో పరీక్షను రద్దు చేసినట్లు తెలిపారు. రద్దు చేసిన పరీక్షను ఏప్రిల్ 27న అదే కేంద్రాల్లో తిరిగి నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థులు తాజా తేదీకి అనుగుణంగా సిద్ధం కావాలని సూచించారు.

## ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో బాంబు కలకలం

**బలగం టీవి, హైదరాబాద్**

ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో శుక్రవారం అనుమానాస్పద వస్తువులు కనిపించడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకెళ్తే స్టేషన్‌లోని చెత్త డబ్బాలో గుర్తు తెలియని వస్తువులు ఉండటంతో గమనించిన ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని గమనించిన మెట్రో సిబ్బంది, అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తక్షణమే ఘటనాస్థలానికి చేరుకుని సమగ్రంగా తనిఖీలు చేపట్టారు. పరిశీలన అనంతరం అవి వేడుకల్లో ఉపయోగించే సాధారణ టపాకాయలేనని నిర్ధారించారు. ఈ సంఘటనతో కొంతసేపు స్టేషన్‌లో ఆందోళన నెలకొన్నప్పటికీ, ఎలాంటి ప్రమాదం లేదని తేలడంతో ప్రయాణికులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



# హెచ్ఎండీఏలో అధికారులకు కొత్త బాధ్యతలు

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)లో పరిపాలనా సౌలభ్యం కోసం కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్లానింగ్ విభాగంలో సిబ్బంది పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించేందుకు మెట్రోపాలిటన్ కమిషనర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. నగర శివారు ప్రాంతాల్లో పెరుగుతున్న నిర్మాణాల ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని, జోన్ల వారీగా బాధ్యతలను కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.

హెచ్ఎండీఏలోని ప్లానింగ్ వింగ్‌ను అయిదు ప్రధాన విభాగాలుగా విభజించారు. అయిదుగురు డైరెక్టర్లకు బాధ్యతలను అప్పగించారు. ఈ మార్పులు తక్షణమే అమల్లోకి వస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందులో డైరెక్టర్-1 ఎంఎంసీ, పాలసీ మ్యాటర్స్, మాస్టర్ ప్లాన్, ఆర్‌డీ ప్లాన్స్ బాధ్యతలను పర్యవేక్షిస్తారు. వీరికి రవీందర్ రెడ్డి, గోపిక రమ్య, కల్పనా కౌడి వంటి సీపీవో, పీవోలు సహకరిస్తారు. డైరెక్టర్-2 శంకర్‌పల్లి జోన్, అత్యంత కీలకమైన శంషాబాద్ పాలసీ మ్యాటర్స్ వ్యవహారాలు చూస్తారు. వీరికి ప్రసాద్ రావు, రవీందర్ రెడ్డి సహకారంతో పాటు కళ్యాణి రాణి, స్వరూప, స్నేహలత, సురేష్ తదితర ఏపీవోలు పనిచేస్తారు. కె. యశ్వంత్ రావు (డైరెక్టర్) సీఎంసీ, ల్యాండ్ పూలింగ్, జీహెచ్ఎంసీ విభాగాలను పర్యవేక్షిస్తారు. వీరికి ప్రసాద్ రావు, (సీపీవో), షాలిని(పీవో)తో పాటు రాజశేఖర్, ఖుద్దుస్, కౌసల్య వంటి ఏపీవో సహకారం ఉంటుంది. వికాస్ (డైరెక్టర్) మేడ్చల్, ఘట్‌కేసర్ జోన్లతో పాటు ఎల్ఆర్ఎస్ బాధ్యతలను చూడనున్నారు. ఈ జోన్లలోని పెండింగ్ అనుమతులపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. వీరికి గోపిక రమ్య, షాలిని(పీవో)తో పాటు విజయశ్రీ, సత్యనారాయణ, రాజీవ్ రెడ్డి, శైలజా, రాధాబాయి, శ్రీకాంత్(ఏపీవో) సహకారం ఉంటుంది. భవానీ రాణి (డైరెక్టర్) హెరిటేజ్, ప్రాజెక్ట్ ఫార్ములేషన్ యూనిట్, గ్రిడ్, స్లిప్ రోడ్లు, లింక్ రోడ్ల విభాగాలకు బాధ్యత వహించనున్నారు. వీరికి పద్మరాణి, సత్యనారాయణ సహకారం అందించనున్నారు.




# హెచ్‌పీఎస్ ఫీజుల పెంపుపై తల్లిదండ్రుల నిరసన

**బలగం టీవి, హైదరాబాద్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రామంతపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద శుక్రవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గత నాలుగేండ్లలో ఏకంగా 141 శాతం వరకు ఫీజులు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం వందలాది తల్లిదండ్రులు పాఠశాల ప్రధాన ద్వారం వద్ద భారీ నిరసన చేపట్టారు. "చర్చల పేరుతో కాలయాపన చేస్తూ మమ్మల్ని మోసం చేస్తున్నారు" అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు గంధం నాగేశ్వర్ రావు, సూరం శంకర్, ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ గత ఏడాదికి పైగా పాఠశాల యాజమాన్యంతో చర్చలు జరిపినా ఎలాంటి పరిష్కారం రాకపోవడంతో తల్లిదండ్రులు వీధుల్లోకి రావాల్సి వచ్చిందని తెలిపారు. వెంటనే తల్లిదండ్రుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

తల్లిదండ్రుల కమిటీ వివరాల ప్రకారం.. 2021లో సుమారు రూ.83,630గా ఉన్న వార్షిక ఫీజు 2025 నాటికి రూ.2 లక్షలను దాటినట్టు పేర్కొన్నారు. ఈ భారీ పెంపు తమపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పలు డిమాండ్లను ముందుకు తెచ్చారు. రాబోయే ఐదేండ్లపాటు ఫీజులను యథాతథంగా ఉంచాలని, ఫీజు పెంపు ఉండదని యాజమాన్యం లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు. ఆ హామీ వచ్చే వరకు మొదటి విడత ఫీజుల చెల్లింపులను నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నారు.అలాగే చట్టబద్ధంగా ఏర్పాటు కావాల్సిన తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, పాఠశాల ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యా ప్రమాణాలు క్షీణించాయని ఆరోపిస్తూ ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడిని తొలగించాలని కూడా కోరారు. పాఠశాల యాజమాన్యం స్పందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తల్లిదండ్రులు స్పష్టం చేశారు.



# ఎండా కాలం జాగ్రత్తలు తెలియజేయాలి..

- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎండాకాలం నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే ప్రజలకి జాగ్రత్తలు తెలియజేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి.. సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి .. వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరిశీలనలో వైద్యురాలు రేణుక, సిబ్బంది తదితరులు ఉన్నారు.



## పెండింగ్ బిల్లుల కోసం నిరసన..
## మాజీ సర్పంచ్ దంపతుల అరెస్ట్

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వల్లంపట్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ స్వంత ఖర్చుతో సుమారు రూ.22 లక్షలు వెచ్చించి జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాల భవనాలను నిర్మించారు. అయితే నిర్మాణానికి సంబంధించిన బిల్లులు గత ఏడాది నుండి పెండింగ్‌లో ఉండటంతో ఆమె పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా స్పందన లేకపోవడం వల్ల ఆవేదన వ్యక్తం చేశారు.

బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్ దంపతులు పాఠశాల భవనానికి తాళం వేసి నిరసన చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని నిరసన చేపట్టిన మాజీ సర్పంచ్ అనసూయతో పాటు ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, ప్రభుత్వ అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు..

- **ఎస్ఈ. టి. వేణు మాధవ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రైతులకు సాగు నీటి అవసరాల కోసం నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరును యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్.ఈ.) టి. వేణు మాధవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఈ టి. వేణు మాధవ్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 17 రోజుల స్వల్ప వ్యవధిలోనే 541 వ్యవసాయ సర్వీసులను మంజూరు చేయడం విశేషమని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం మొత్తంలో కేవలం 1400 సర్వీసులు మాత్రమే మంజూరయ్యాయని, ప్రస్తుత వేగం శాఖ యొక్క పనితీరుకు మరియు రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అదనంగా 28 ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ఏర్పాటు చేసామని అన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 1950 వ్యవసాయ సర్వీసులన్నింటినీ రాబోయే జూన్ నెల నాటికి పూర్తి స్థాయిలో మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు వంటి మెటీరియల్ తగినంతగా అందుబాటులో ఉందని, పనులు నిరంతరాయంగా కొనసాగుతాయని రైతులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో, రైతులకు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. వినియోగదారుల భద్రత, శ్రేయస్సు తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలని, పారదర్శకమైన సేవలు అందించేందుకు విద్యుత్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని అన్నారు.



# నష్టాల్లో ఉన్న సంస్థలో 'సెస్' విలీనమా..

- **ఇది కుట్రపూరిత నిర్ణయమే..**
- **కృష్ణయ్య కమిటీ నివేదికను ఎందుకు దాస్తుండ్రు..**
- **సెస్ చైర్మన్ చిక్కాల రామారావు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

లాభాల్లో నడుస్తున్న సెస్‌ను, సుమారు 30 వేల కోట్ల భారీ నష్టాల్లో ఉన్న టీజీ ఎన్పీడీసీఎల్‌లో కలపడం కుట్రపూరిత నిర్ణయమని,ఇది కేవలం సెస్‌ను ప్రైవేటీకరించడానికే చేస్తున్న ప్రయత్నమని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని సెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ.. 56 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సెస్ సంస్థను, అందులో పనిచేస్తున్న 411 మంది ఉద్యోగుల భవిష్యత్తును కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా కృష్ణయ్య కమిటీ నివేదిక ఇచ్చి 16 ఏళ్లు గడుస్తున్నా, దానిని ఇప్పటికీ బహిర్గతం చేయకుండా రహస్యంగా ఉంచడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని అన్నారు. ప్రస్తుతం సెస్‌కు రావాల్సిన 787 కోట్ల రూపాయల బకాయిల్లో 537 కోట్లు ప్రభుత్వం నుంచే రావాల్సి ఉందని అన్నారు . తమ పాలకవర్గం ఎక్కడా అవినీతికి తావు లేకుండా, సాహసోపేత నిర్ణయాలతో సంస్థను లాభాల బాటలో నడిపిందని అన్నారు.? జీఓ నంబర్ 06, 07లను తాము సైట్ నుంచే డౌన్‌లోడ్ చేసుకున్నామని, పాలకవర్గాన్ని రద్దు చేస్తామని ప్రభుత్వం బెదిరించడం అన్యాయమని మండిపడ్డారు. గత 25 ఏళ్లుగా సంస్థను నిరంతరం ఇబ్బందులకు గురిచేస్తున్నారని , సెస్ ఉనికిని కాపాడటం కోసం తమ పాలకవర్గం మొత్తం రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు . ఈ నెల 20వ తేదీ తర్వాత తమ భవిష్యత్ కార్యాచరణను వెల్లడిస్తామని, అవసరమైతే ఈ విలీన ప్రక్రియపై న్యాయపోరాటం చేస్తామని అన్నారు.

# రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి సామాజిక బాధ్యత..

- **రహదారి నిబంధనలే రక్షాకవచం..**
- **రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని,వారు పాటించే రహదారి నిబంధనలే వారి ప్రాణాలకు నిజమైన రక్షాకవచాలని రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు అన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ,రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ నుంచి వారోత్సవాల సందర్భంగా అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో జిల్లాలోని ఆర్టీసీ, విద్యాసంస్థలు, ఆటో, మున్సిపల్, ఇతర వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం, సీపీఆర్ ప్రథమ చికిత్సపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్యఅతిథిగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను కాపాడే తొలి వ్యక్తులు డ్రైవర్లేనని, వారు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలు, బస్సులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, విద్యార్థుల భద్రత విషయంలో తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ 'రహావీర్' పథకం ప్రవేశపెట్టినదని , ప్రమాదం జరిగిన గంటలోపు బాధితులను ఆసుపత్రికి చేర్చిన



వారికి రూ. 25,000 ప్రోత్సాహకం అందిస్తామని, అలాగే బాధితులకు వారం రోజుల పాటు రూ. 1,50,000 వరకు ఉచిత వైద్య సాయం అందుతుందని అన్నారు. తెలంగాణలో ప్రతిరోజూ సగటున 70 ప్రమాదాలు జరుగుతున్నాయని, అందులో 20 మంది మరణిస్తుండటం విచారకరమని, ఓవర్ స్పీడ్, రాంగ్ ఓవర్ టేకింగ్ వంటివే వీటికి ప్రధాన కారణమని అన్నారు కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, యుద్ధాలు లేదా వ్యాధుల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే దేశంలో అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది దేశవ్యాప్తంగా జరిగిన 4.70 లక్షల ప్రమాదాల్లో 1.70 లక్షల మంది మృతి చెందారని తెలిపారు. ప్రతి డ్రైవర్ తమ కుటుంబ బాధ్యతను గుర్తుంచుకొని వాహనాలు నడపాలని కోరారు. జిల్లాలో బ్లాక్ స్పాట్స్ గుర్తింపు, సైన్ బోర్డుల ఏర్పాటు వంటి చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని, డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మార్చి 6న ప్రారంభమైన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జిల్లావ్యాప్తంగా పారిశుధ్యం, వైద్య ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని అన్నారు.

ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. జిల్లాలో కొదురుపాక బ్రిడ్జ్, నందికమాన్, తిప్పాపూర్ బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, పెద్దూర్, ఎల్లారెడ్డిపేట హెచ్‌పీ బంక్, పద్మనగర్, సారంపల్లి వంటి ఎనిమిది ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులందరూ వాహన డ్రైవర్లతో కలిసి రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత, తహసీల్దార్ మహేష్ కుమార్, సీ.ఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మధుకర్, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, సురేష్,ఎస్.ఐ లు, పోలీస్, రవాణా శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదు

- **రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల భారీ నిరసన**




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ పిలుపుమేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జేఏసీ చైర్మన్ ఎలుసాని ప్రవీణ్ మరియు కో చైర్మన్ సమర్ సేన్ నేతృత్వంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి పెండింగ్ బిల్లులు, పీఆర్సీ అమలు మరియు హెల్త్ కార్డుల జారీ, పలు ఉద్యోగుల సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు.?

ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా విచ్చేసిన రాష్ట్ర లెక్చరర్ల ఫోరం అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వవలసిన రెండో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని డిఏలను తక్షణమే విడుదల చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్‌ను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం గనుక స్పందించకపోతే ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య దూరం పెరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని మరియు హెల్త్ కార్డుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అన్నారు .?అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ జి. నగేష్ ని కలిసి ఉద్యోగుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల సుదర్శన్, టీజీఓ జిల్లా కార్యదర్శి సయ్యద్ జబీ, నాయకులు శ్రీకాంత్, రియాజ్, సాగర్, వివిధ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఎప్పుడు..?

- **కొనుగోలు కేంద్రాల వద్దకు చేరిన ధాన్యం**
- **అకాల వర్షాలు పడితే రైతులు నష్టపోతారు: సర్పంచ్ కొండ రమేష్ గౌడ్**



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్దకు గత 15 రోజుల నుండి తరలిస్తున్నారని,అకాల వర్షాలు కురిసి రైతులు నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని, అలాగే ఎండ తీవ్రతలు పెరిగినందున రైతులు వడదెబ్బ తగిలి అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నందున వెంటనే వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మండల వ్యాప్తంగా ఇప్పటివరకు ఎక్కడ వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని ఇట్టి విషయాన్ని గమనించి జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులు తక్షణమే వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రాచర్ల గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ అధికారులను మీడియా ముఖంగా

# ఎల్లారెడ్డి హాస్టల్‌లో ప్రభుత్వ నిర్లక్ష్యానికి విద్యార్థిని మృతి...




- **సీఎం వెంటనే బాధ్యత వహించాలి**
- **బీఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్ డిమాండ్..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి బీసీ బాలికల హాస్టల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న శ్రావణి అనే విద్యార్థిని మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ ఆరోపించారు. గురువారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి వహించాల్సిందేనని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల భద్రత పట్ల నిర్లక్ష్యం పెరిగిందని విమర్శించారు.

గత 25 నెలల్లో 140 మందికి పైగా విద్యార్థులు మృతి చెందడం ప్రభుత్వ వైఫల్యానికి ఉదాహరణ అని ఆయన అన్నారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి ఇప్పటివరకు సమీక్షా సమావేశాలు నిర్వహించకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఒకప్పుడు తెలంగాణ గురుకుల, హాస్టల్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రస్తుతం అదే వ్యవస్థ క్షీణిస్తోందని ఆయన పేర్కొన్నారు.

శ్రావణి మృతి ఘటనపై తక్షణమే న్యాయం చేయాలని, బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పేద కుటుంబాల పిల్లలు చదువుకునే హాస్టళ్లలో భద్రత లేకపోవడం ఆందోళనకరమని, తల్లిదండ్రులు ఆశలతో పంపిన పిల్లలు ప్రాణాలు కోల్పోతే దానికి ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేదంటే బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కంచర్ల రవి గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అరెల్లి వినయ్ కుమార్, సాదు శేఖర్, ఎండి సమీర్, హరీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగలకు జనాభా ప్రాతిపదికన 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణ ప్రకారం మాదిగలకు 11 శాతం కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ మరియు ఎంఎస్పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్ మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు కానాపురం లక్ష్మణ్ మాదిగ, మరియు జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి మాదిగ మాట్లాడుతూ.. ?మాదిగల జనాభా 10 నుండి 11 శాతం వరకు ఉంటుందని తమ అధినేత మందకృష్ణ మాదిగ మొదటి నుండి చెబుతున్నారని, కులగణన సర్వే ద్వారా ఆ విషయం ఇప్పుడు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఒకవేళ కులగణన ఇంకా పూర్తిస్థాయిలో శాస్త్రీయంగా నిర్వహిస్తే తమ జనాభా రెట్టింపు స్థాయిలో ఉండే అవకాశం ఉందని అన్నారు. ఇదే క్రమంలో కేవలం 9 శాతం రిజర్వేషన్లను స్వాగతించి కొంతమంది మేధావులు జాతికి అన్యాయం చేసినారు అని తీవ్రంగా విమర్శించారు. పాలకుల మెప్పు కోసం జాతి ప్రయోజనాలను దెబ్బతీసే వారికి మాదిగ సమాజంలో స్థానం ఉండదని హెచ్చరించారు.? ఎస్సీ వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చే క్రమంలో మందకృష్ణ మాదిగ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి 11 శాతం వాటా గురించి విన్నవించారని, మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపైనే ఉందని అన్నారు. మాదిగల్లోని పేదరికం తొలగించడానికి ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకోవాలని, మందకృష్ణ మాదిగ




నాయకత్వంలో జాతి మరింత సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. అలాగే మహాత్మ జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి ఉత్సవాల అత్యున్నత కమిటీలో మందకృష్ణ మాదిగకు చోటు కల్పించినందుకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు మాదిగ, మండల అధ్యక్షులు శ్రావణ పెల్లి బాలయ్య, దయ్యాల నారాయణ , కర్రే శంకరయ్య , కొమ్ము రాజశేఖర్ , నాయకులు సామల ప్రతాప్, మల్యాల లక్ష్మణ్, మునిగే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విమానాశ్రయ పరిధిలో నాయిస్ జోన్ ఎత్తివేత

- నిబంధనలు సడలించిన తెలంగాణ ప్రభుత్వం
- రియల్ వ్యాపారులకు వరం కానున్న జీవో 168




**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వంటి విమానాశ్రయాల పరిసరాల్లో భవన నిర్మాణాలపై ఉన్న ఆంక్షలను సవరిస్తూ తెలంగాణ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012లో మార్పులు చేస్తూ జీవోఎంఎస్ నంబర్ 168 ద్వారా సవరణలను ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ విమానాశ్రయాల పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు సంబంధించి కీలక ఉత్తర్వులను జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్ నాయిస్ జోన్ నిబంధనలలో మార్పులు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రియల్

ఎస్టేట్ రంగానికి, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది. క్షిపణి విమానాల రాకపోకల వల్ల కలిగే శబ్ద కాలుష్యం దృష్ట్యా, గతంలో నిర్మాణాలపై కఠినమైన నియంత్రణలు ఉండేవి. అయితే, మారుతున్న పట్టణాభివృద్ధి అవసరాలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. నాయిస్ జోన్ ప్రభావిత ప్రాంతాల్లో నిర్మాణ అనుమతులపై ప్రభుత్వం ఇప్పుడు మరింత స్పష్టతనిచ్చింది. నాయిస్ జోన్ కిందకు వచ్చే ప్రాంతాల్లో భవనాల ఎత్తు, రకానికి సంబంధించి గతంలో ఉన్న కొన్ని అడ్డంకులను తొలగించారు. విమానాల శబ్దం వల్ల నివాసితులకు ఇబ్బంది కలగకుండా, భవన నిర్మాణంలో ధ్వని నిరోధక ప్రమాణాలను పాటించడాన్ని తప్పనిసరి చేసే అవకాశం ఉంది. ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, రియల్ ఎస్టేట్ వృద్ధికి ఆటంకం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏయే ప్రాంతాల్లో ఎలాంటి భవనాలు నిర్మించవచ్చో స్పష్టమైన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఈ ఉత్తర్వుల వల్ల ఎయిర్‌పోర్ట్ సమీపంలోని ప్రాంతాల్లో భూముల విలువ పెరగడంతో పాటు, నిర్మాణ రంగంలో పారదర్శకత పెరుగుతుంది. నిబంధనల్లో స్పష్టత రావడం వల్ల మున్సిపల్ అధికారుల వద్ద ప్లాన్ అప్రూవల్స్ త్వరగా పొందే అవకాశం ఉంది. గతంలో నాయిస్ జోన్ పరిధిలో ఏ నిర్మాణం చేపట్టాలన్నా అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యేవి. తాజా సవరణలతో ఆ సమస్యలు తొలగిపోనున్నాయి. శంషాబాద్, పరిసర ప్రాంతాల్లో కొత్త వెంచర్లు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి ఈ జీవో మార్గం సుగమం చేస్తుంది. విమానాశ్రయ పరిసరాల నియంత్రణ, పౌర భద్రతను సమన్వయం చేస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న తరుణంలో, ఇలాంటి సవరణలు నగరం అన్ని వైపులా విస్తరించడానికి దోహదపడతాయి. భవన యజమానులు, డెవలపర్లు ఈ కొత్త జీవో ప్రకారం తమ నిర్మాణ ప్రణాళికలను రూపొందించుకోవాలని అధికారులు సూచించారు.

# తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని శవం

- మూడు నెలలుగా పడి ఉండడంతో కుళ్లిన దేహం
- స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత విషాదకరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. జేకే కాలనీలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. మూడు నెలలుగా తాళం వేసి ఉన్న ఇంట్లో శవం దొరకడం అనేక అనుమానాలకు తావిస్తోంది. జేకే కాలనీలోని ఓ ఇంట్లో గతంలో ఒక వ్యక్తి అద్దెకు ఉండేవారు. అయితే, గత మూడు నెలలుగా ఆ ఇంటికి తాళం వేసి ఉంది. అక్కి-దదెదారు కనిపించకపోవడం, కనీసం ఇంటి యజమానికి అక్కి-దదె కూడా చెల్లించకపోవడంతో యజమానికి అనుమానం వచ్చింది. ఇంటి యజమాని వచ్చి తాళం విరగ్గొట్టి లోపలికి వెళ్లి చూడగా, ఇల్లు మొత్తం దుర్వాసనతో నిండిపోయింది. లోపలికి వెళ్లి వెతకగా, వంటగదిలోని కిచెన్‌లో కింద గుర్తు తెలియని వ్యక్తి శవం కనిపించింది.

సమాచారం అందుకున్న వెంటనే నేరేడ్‌మెట్ పోలీసులు క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో, అది పురుషుడిదా లేక మహిళదా అనేది కూడా ప్రాథమికంగా గుర్తించలేనంత దారుణంగా ఉంది. శవం కిచెన్ బండ కింద ఉంచడాన్ని చూస్తే, ఇది ఓ పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హత్య అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎవరైనా చంపి అక్కడ దాచిపెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఆ ఇంట్లో నివసించిన వ్యక్తి ఎవరు..?, అతను ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు? అనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాలనీలో ఉన్న సీసీటీవీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. గత మూడు నెలల్లో ఆ ఇంటికి ఎవరెవరు వచ్చారనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. జనసంచారం ఉండే కాలనీలో, అది కూడా మూడు నెలల పాటు ఇంట్లో శవం ఉండటం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది.

# గంభీరావుపేటలో 33కేవీ ఇంటర్‌లింక్ లైన్ ప్రారంభం..



**బలగం టీవీ, గంభీరావుపేట:**

గంభీరావుపేట సెక్షన్ పరిధిలోని కొత్తపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేందుకు నిర్మించిన 3.0 కిలోమీటర్ల పొడవైన 33కేవీ ఇంటర్‌లింక్ లైన్‌ను శుక్రవారం విజయవంతంగా చార్జ్ చేశారు. ?

ఈ సందర్భంగా ఎన్పీడీసీయల్ సీఈ బి. అశోక్ మాట్లాడుతూ.. ఈ ఇంటర్‌లింక్ లైన్ ద్వారా కొత్తపల్లి, శ్రీగాధ, కొల్లమడ్డి, రాజుపేట గ్రామాలకు నిరంతరాయంగా విద్యుత్ అందుతుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు లేదా సాంకేతిక లోపాల వల్ల ప్రధాన లైన్లలో అంతరాయం కలిగినా, ఈ ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సరఫరా కొనసాగుతుందని అన్నారు. దీనివల్ల రైతులకు, గృహ వినియోగదారులకు మరియు చిన్న పరిశ్రమలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పనులు వేగంగా పూర్తి చేసిన సిబ్బందిని ఈ సందర్భంగా అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ టి. వేణు మాధవ్, డీఈ అంజయ్య, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు ఆనంద్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు..

- జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం

**బలగం టీవీ, గంభీరావుపేట:**

రైతులు సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన మరియు శ్రేష్ఠమైన వరి సన్న విత్తనాలను ఉపయోగించడం ఎంతో కీలకమని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం పేర్కొన్నారు. గంభీరావుపేట మండలంలో నాణ్యమైన విత్తన విక్రయాలను ప్రోత్సహించేందుకు విత్తన డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం హాజరై మాట్లాడుతూ విత్తన డీలర్లు రైతులకు సరైన మార్గదర్శకత్వం అందించాలని, ప్రభుత్వం సూచించిన ధృవీకరించబడిన (సర్టిఫైడ్) విత్తనాలను మాత్రమే విక్రయించాలని అన్నారు . నకిలీ విత్తనాల విక్రయాలను పూర్తిగా నివారించాలని, నాణ్యత ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని, ఒకవేళ ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. .రైతులకు అవసరమైన విత్తనాలు సమయానికి అందేలా చూడాలని, విత్తన ధరలు ప్రభుత్వం నిర్ణయించిన విధంగానే ఉండాలని సూచించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ



సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి మొహమ్మద్ సలావుద్దీన్, ఏఈఓ ప్రవీణ్, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

# అంగన్వాడీలు సృజనాత్మకతకు వేదికలు..



- జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

అంగన్వాడీ కేంద్రాలు కేవలం పోషకాహారానికే పరిమితం కాకుండా, బాలల సృజనాత్మకతను వెలికితీసే విజ్ఞాన కేంద్రాలుగా మారుతున్నాయని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల ప్రాజెక్టు పరిధిలోని గూడెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సృజనాత్మక కృత్యాలను వారు స్వయంగా పరిశీలించి, పిల్లల ప్రతిభను అభినందించారు.

ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ.. ఎటువంటి ఒత్తిడి లేని, ఆహ్లాదకరమైన బాలల స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థులకు పాఠాలు నేర్పించడం ద్వారా వారిలో నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. ఆటపాటలు, కృత్యాల ద్వారా విద్యను అందించడం వల్ల పిల్లల మేధో వికాసం వేగంగా జరుగుతుందని అన్నారు.?మనిషి జీవితంలో మొదటి 1000 రోజులు మేధోవికాసానికి అత్యంత కీలకమైనవని, ఈ దశలో పిల్లలకు సరైన పోషణతో పాటు ఆహ్లాదకరమైన విద్యను అందించడం వల్ల వారికి ఉజ్వలమైన భవిష్యత్తును అందించిన వారమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, డి-హబ్ కోఆర్డినేటర్ రోజా, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది సాయిరాం, అంగన్వాడీ సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా రాచర్ల వేణు కుమార్

**బలగం టీవీ, గంభీరావుపేట:**

గంభీరావుపేట మండల ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాచర్ల వేణు కుమార్ ఉధ్యక్షుడిగా దుంపటి సాయి కుమార్, కోశాధికారిగా గుమ్ముల రాజు, ప్రచార కర్తగా రాచర్ల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా రాచర్ల వేణు కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వృత్తిపరంగా ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, ఫోటోగ్రఫీ రంగాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ఫోటో మరియు వీడియో గ్రాఫర్లు పాల్గొని, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.





## ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన గురుకుల బీసీ విద్యార్థులకు సన్మానం

- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**బలగం టీవి, హైదరాబాద్**

బీసీ గురుకులాల్లో ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించాలని నిర్ణయించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీ సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని వ్యాఖ్యానించారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ బాలమయాదేవి , బీసీ గురుకులాల సెక్రెటరీ సైదులు, ఎండీ మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. బీసీ సంక్షేమ శాఖలో పెండింగ్ అంశాలపై ఈ సమీక్షా సమావేశంలో చర్చించామని పేర్కొన్నారు. బీసీ విదేశీ విద్యానిధికి సంబంధించి లబ్దిదారుల ఎంపికపై సమావేశంలో మాట్లాడామని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.హాస్టళ్లు, గురుకుల పాఠశాలల అద్దెలు ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం సమయానికి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు చేరాలా చర్యలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. కాటమయ్య రక్షణ కవచాలను.. శిక్షణ ఇచ్చిన వారికి కిట్స్ అందజేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం తగదు

- పాక్‌ను హెచ్చరించిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ,ఏప్రిల్17(ఆర్ఎన్ఎ): భారత అంతర్గత వ్యవహారాల్లో బయటివారు జోక్యం చేసుకోవద్దని విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్‌ను హెచ్చరించింది. డీలిమిటేషన్ బిల్లుపై పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చింది. దేశానికి సంబంధించిన అంతర్గత విషయాల్లో చొరబడేందుకు చేసే యత్నాలను భారత్ ఎన్నటికీ సహించబోదని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. దేశంలోని పరిపాలనా, శాసనపరమైన పక్రియలకు సంబంధించిన నిర్ణయాలు సార్వభౌమత్వానికి సంబంధించిన విషయాలని.. వీటిలో ఇతర దేశాల జోక్యాన్ని సహించబోమన్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు ఎన్నికల సంఘానికి అధికారం కల్పించే ఒక నిబంధన డీలిమిటేషన్ బిల్లు 2026లో ఉంది. ఈ నిబంధనపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్ ప్రవేశపెట్టిన ఈ డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ పేర్కొన్నారు.




## ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారం కాకుండా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీపీఓ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారం అర్జున్ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయడం, జూన్ 2లోగా పీఆర్సీ ప్రకటించడం, 61 సంవత్సరాల వీఆర్ఏ వారసుల సమస్యలు పరిష్కరించడం, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ స్కీమ్స్‌ను తక్షణం అమలు చేయడం, వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ ఛానెల్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, టీజీఆర్ఈఎస్ఏ నాయకులు దినేష్ ప్రసాద్, జీపీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారం అర్జున్, జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, వేణు, రాజు, సాయి తేజ, సాయి, లావణ్య, అంజలి, భరత్ తదితరులతో పాటు వీఆర్ఏ నాయకులు పిట్టల రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలి

- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో ఆఫీస్ ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఉద్యోగ సంఘాల నాయకులు ఆర్డీవో కి వినతిపత్రాన్ని సమర్పించారు.?ఈ సందర్భంగా టీజీఈ జేఏసీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా 2026 జూన్ 2వ తేదీ నాటికి నూతన పీఆర్సీని ప్రకటించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడంతో పాటు, ఉద్యోగులందరికీ తక్షణమే హెల్త్ కార్డ్స్ జారీ చేసి వైద్య సౌకర్యాలు కల్పించాలని అన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని, గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 61 ఏళ్లు నిండిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ నియామక ప్రక్రియను పూర్తి చేయాలని నాయకులు కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల భద్రత కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జనాభా లెక్కల కార్యక్రమం ప్రారంభం కాకముందే ఉద్యోగ, ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని అన్నారు. టీజీఈ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ ఉద్యమం కొనసాగుతుందని, సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిజిఆర్ఎస్ఏ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు వి మురళీకృష్ణ, ,జి పి ఓ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారం అర్జున్, టిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లెక్కల జయకృష్ణారెడ్డి ఎస్ జి టి యు జిల్లా అధ్యక్షులు పి రమణారెడ్డి తదితరులతోపాటు, నయా తహసిల్దార్ జ్యోతి, జిల్లా జేఏసీ నాయకులు కుమ్మరి ఆంజనేయులు, శ్రీనివాస్ రాజు సాయికుమార్ అంజలి భారత్ పరశురాం మోహన్ నాయకులు తదితరులు లతో పాటు 50 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.




## దాచారం పాఠశాలలో నల్ల బ్యాడ్జిలు ధరించి ఉపాధ్యాయుల నిరసన..

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలోని దాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉపాధ్యాయులు ఉద్యోగ,బ్యాడ్జిఉపాధ్యాయ, పెన్షనర్ లా పి ఆర్ సి, పెండింగ్ సమస్యలపై జాక్టో సంఘాల పిలుపుమేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాణి, ఉపాధ్యాయులు తూముకుంట నరేందర్ రెడ్డి, శ్రీను, దావీదు, శ్రీనివాస్, సంజీవ్, శ్రావణ్ పాల్గొన్నారు.



# గుజరాత్ టైటాన్స్‌కు బిగ్ షాక్..

● టోర్నీ నుంచి టామ్ బాంటన్ ఔట్!

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026 సీజన్ మధ్యలో గుజరాత్ టైటాన్స్ జట్టుకు బిగ్ షాక్ తగిలింది. ఆ జట్టులోని స్టార్ ప్లేయర్, జోస్ బట్లర్ దేశస్థుడైన ఇంగ్లాండ్ బ్యాటర్ టామ్ బాంటన్ గాయం కారణంగా ప్రస్తుత సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. వేలి గాయంతో బాధపడుతున్న టామ్ బాంటన్ టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడని ఐపీఎల్ అధికారికంగా శుక్రవారం ప్రకటించింది. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో జరగనున్న కీలక మ్యాచ్‌కు ముందు ఈ వార్త శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ జట్టును కలవరపెడుతోంది.టామ్ బాంటన్ స్థానాన్ని భర్తీ చేసేందుకు గుజరాత్ టైటాన్స్ వేగంగా పావులు కదిపింది. దక్షిణాఫ్రికాకు చెందిన యువ వికెట్ కీపర్, బ్యాటర్ కానర్ ఎస్టర్‌హుజెన్‌ను బాంటన్ రీప్లేస్‌మెంట్‌గా జట్టులోకి తీసుకుంది. కేవలం రూ. 75 లక్షల బేస్ ధరతో ఎస్టర్‌హుజెన్ గుజరాత్ జట్టులో చేరాడు. 24 ఏళ్ల ఈ యువ ప్లేయర్ ఐపీఎల్‌లో అడుగుపెట్టడం ఇదే తొలిసారి. టామ్ బాంటన్ దూరం కావడంతో వచ్చిన లోటును ఈ యువ సంచలనం ఏ మేరకు భర్తీ చేస్తాడన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దక్షిణాఫ్రికా క్రికెట్‌లో కానర్ ఎస్టర్‌హుజెన్ స్టార్‌గా పేరు తెచ్చుకున్నాడు. గత నెలలో న్యూజిలాండ్‌తో జరిగిన 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ద్వారా కానర్ ఎస్టర్‌హుజెన్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఎస్టర్‌హుజెన్.. రెండుసార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులను గెలుచుకోవడమే కాకుండా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా కూడా నిలిచాడు. దక్షిణాఫ్రికా 1–2తో వెనుకబడిన స్థితి నుంచి సిరీస్‌ను 3–2తో గెలవడంలో అతను కీలక పాత్ర పోషించాడు.ఐపీఎల్ టోర్నమెంట్ అత్యంత కీలక దశకు చేరుకుంటున్న సమయంలో ఈ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. గుజరాత్ టైటాన్స్ తమ తదుపరి మ్యాచ్‌ను అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆడనుంది. ఈ హోమ్ మ్యాచ్‌కు ముందే కొత్త ఆటగాడు జట్టుతో చేరనుండటం గిల్ సేనకు కొంత ఊరటనిచ్చే విషయమే. దక్షిణాఫ్రికాలో తన సత్తా చాటిన ఈ యువ హిట్టర్, భారత గడ్డపై ఐపీఎల్ అరంగేట్రంలో ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో చూడాలి.





# కోహ్లీ ఒక్క లైక్‌తో సోషల్ మీడియాలో ట్రెండ్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఒకే ఒక్క లైక్... సోషల్ మీడియానే షేక్ చేస్తోంది. ఇండియన్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తాజాగా మోడల్ లిజ్‌లాజ్ పోస్ట్ లైక్ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై నెటిజన్లు నెట్టింట మీమ్స్‌తో హల్చల్ చేస్తున్నారు. ఒక్కసారిగా సదరు మోడల్ పేరు నెట్టింట ట్రెండ్ అయిపోయింది. ఇన్‌ఫ్లుయెన్సర్ లిజ్‌లాజ్ ఫోటోలతో కూడిన పోస్టును కోహ్లీ లైక్ చేయడం వైరల్‌గా మారింది. ఆమెను ఫాలో కానప్పటికీ లైక్ కొట్టడం చర్చనీయాంశమైంది. జర్మనీకి చెందిన ఈమె 'గోల్డెన్ అవర్ షాట్స్' అంటూ తన ఫోటోలను షేర్ చేసింది. జనవరి 30న పెట్టిన ఈ పోస్టుకు కోహ్లీ లైక్ కొట్టినట్లు కనిపించింది. దీన్ని ఆయన అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. అయితే, ఇది అనుకోకుండా జరిగిందా? అల్గారిథమ్ వల్ల జరిగిందా? అంటూ డిబేట్ మొదలెట్టారు. కొందరు ఫన్ ఎమోజీస్‌తో నింపేశారు. అసలు ఆమె ఎవరు? అంటూ తెగ సెర్చ్ చేస్తున్నారు. లిజ్ లాజ్ జర్మనీకి చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్. సగం సౌతాఫ్రికాకు చెందిన మూలాలు కూడా ఉన్నాయి. ఎంఎస్సీ సైకాలజీ కంప్లీట్ చేసింది. వ్లోగర్, సింగర్‌గా తన ఇన్ స్టా ఐడీని పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ... ట్రావెల్ వ్లాగ్స్, లైఫ్ స్టైల్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు షేర్ చేస్తుంటుంది.ఆర్సీబీకి ఫ్యాన్స్ అంటూ తాజాగా ఓ వీడియోను తన ఇన్ స్టా స్టోరీలో పెట్టుకుంది. సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అద్వైత్ వైద్య ఆమెతో ఫోటో షుట్ చేయగా... వాటిని ఇన్ స్టాలో షేర్ చేశారు. ఇప్పటివరకూ లిజ్‌లాజ్‌కు దాదాపు 4.27 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. 274 పోస్టులు చేశారు. సాక్షాత్తూ భారత క్రికెట్ లెజెండ్ ఆమె పోస్టుకు లైక్ చేయడంతో ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు. లిజ్ లాజ్ జర్మనీకి చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్. సగం సౌతాఫ్రికాకు చెందిన మూలాలు కూడా ఉన్నాయి. ఎంఎస్సీ సైకాలజీ కంప్లీట్ చేసింది. వ్లోగర్, సింగర్‌గా తన ఇన్ స్టా ఐడీని పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ... ట్రావెల్ వ్లాగ్స్, లైఫ్ స్టైల్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు షేర్ చేస్తుంటుంది. ఆర్సీబీకి ఫ్యాన్స్ అంటూ తాజాగా ఓ వీడియోను తన ఇన్ స్టా స్టోరీలో పెట్టుకుంది. సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అద్వైత్ వైద్య ఆమెతో ఫోటో షుట్ చేయగా... వాటిని ఇన్ స్టాలో షేర్ చేశారు. ఇప్పటివరకూ లిజ్‌లాజ్‌కు దాదాపు 4.27 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. 274 పోస్టులు చేశారు. సాక్షాత్తూ భారత క్రికెట్ లెజెండ్ ఆమె పోస్టుకు లైక్ చేయడంతో ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు.

# గుజరాత్ విజయం.. కోల్‌కతాకు మరో నిరాశ

● గిల్ అద్భుత ఇన్నింగ్స్‌తో ఐదు వికెట్ల తేడాతో గెలుపు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే నాలుగు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసిన ఆ జట్టు, మరో ఉత్కంఠభరిత పోరులో గుజరాత్ టైటాన్స్ చేతిలో ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌తో కోల్‌కతా ఐదోసారి నిరాశతో మైదానం వీడింది.

మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా జట్టు 180 పరుగులకు ఆలౌటైంది. కామెరూన్ గ్రీన్ (79) అర్ధశతకంతో జట్టును ఆదుకున్నాడు. టాప్ ఆర్డర్ విఫలమైనా పావెల్ (17), రమన్‌దీప్ సింగ్ (17) కొంత మేర సహకరించారు. గుజరాత్ బౌలర్లలో రబడ 3 వికెట్లు, సిరాజ్ 2 వికెట్లు తీసి కోల్‌కతాను కట్టడి చేశారు.

అనంతరం 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ జట్టు ఆత్మవిశ్వాసంతో ఆడింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (22) త్వరగా ఔటైనా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (86) అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. అతనికి గ్లెన్ ఫిలిప్స్ (19), వాషింగ్టన్ సుందర్ (13) మద్దతు అందించారు. చివరి ఓవర్ వరకు ఉత్కంఠ కొనసాగగా, గుజరాత్‌కు ఐదు పరుగులు అవసరమైన సమయంలో ఫిలిప్స్ ఔటయ్యాడు. అయినప్పటికీ షారుక్ ఖాన్, రాహుల్ తెవాటియా సమయోచితంగా సింగిల్స్, డబుల్స్ తీసి జట్టుకు విజయాన్ని అందించారు. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో ముందంజ వేసింది. మరోవైపు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ఇంకా తొలి విజయానికే ఎదురుచూస్తోంది.



# వరల్డ్‌కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

భారత్ – శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన 2026 టీ20 ప్రపంచకప్ గతనెల విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నీ ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించి భారత్ విశ్వవిజేతగా నిలిచింది. అయితే ఈ టోర్నమెంట్ ముగిసి నెల రోజులు గడిచిన తర్వాత తాజాగా దీనిపై ఓ షాకింగ్ వార్త వెలుగులోకి వచ్చింది. టోర్నీలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కెనడా మ్యాచ్ ఫిక్సింగ్?కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ మ్యాచ్‌పై ఐసీసీ తాజాగా విచారణ ప్రారంభించింది.చెన్నై చెపాక్ స్టేడియం వేదికగా కెనడా – న్యూజిలాండ్ జట్ల మధ్య లీగ్ స్టేజ్?లో? మ్యాచ్ జరిగింది. ఇందులో కివీస్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సూపర్ 8కు దూసుకొచ్చింది. అయితే ఈ మ్యాచ్?లో కెనడా మ్యాచ్ ఫిక్సింగ్?కు పాల్పడిందని ఇటీవల సీబీసీ ఓ డాక్యుమెంటరీ రూపొందించింది. ఇది ఇప్పుడు క్రికెట్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

ఈక్రమంలోనే కెనడా క్రికెట్ జట్టుపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం రెండు కీలక విచారణలను ప్రారంభించినట్లు ఈఎస్?పీఎన్ క్రిక్ఇన్ఫో నివేదిక పేర్కొంది. ఈ మ్యాచ్ ఛేజింగ్?లో? కివీస్ నాలుగు ఓవర్లకు 35– 2 స్కోర్?తో ఉంది. అయితే ఆ తర్వాత కెనడా కెప్టెన్ దిల్ప్రీత్ బాజ్వా వేసిన ఐదో ఓవర్?లో ఒక 'నో– బాల్', ఓ 'వైడ్' సహా 15 పరుగులు వచ్చాయి. ఆ ఓవర్ తర్వాత మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. కివీస్ బ్యాటర్లు రెచ్చిపోయి ఆడాడు. ఫలితంగా కివీస్ 174 పరుగుల ఛేదనలో 15.1 ఓవర్లలో అందుకుంది. అయితే మ్యాచ్?లో ఆ ఓవర్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. ఈ క్రమంలో కెప్టెన్ బజ్వా వేసిన ఓవర్?పై అనుమానాలు మొదలయ్యాయి. మ్యాచ్?లో ఆ ఓవర్ అనుమానస్పదంగా మారిందని కెనడాకు చెందిన ఇన్వెస్టిగేషన్ కార్యక్రమం 'ది ఎఫ్త్ ఎస్టేట్' పేర్కొంది. అది నిజంగానే పేలవమైన బౌలింగా, లేక కెప్టెన్ ఉద్దేశపూర్వకంగానే అన్ని పరుగులు ఇచ్చేశాడా? అన్న అశంలో ఐసీసీ విచారణ జరుపుతోంది. ఇప్పుడు ఈ ఓవర్ విచారణ పరిధిలోకి వచ్చింది. అది నిజంగానే పేలవమైన బౌలింగా, లేక కెప్టెన్ ఉద్దేశపూర్వకంగానే అన్ని పరుగులు ఇచ్చేశాడా? దీనికి ఏదైనా 'స్పాట్ – ఫిక్సింగ్' లేదా బెట్టింగ్‌తో సంబంధం ఉందా? అనే కోణంలో విచారణ జరుపుతోంది. ఇలాంటి వ్యవహారాలపై ఎప్పటికప్పుడు స్పందించే స్థితిలో ఏసీయూ లేదని ఐసీసీ తాత్కాలిక జీఎం అండ్రూ ఎఫ్?గ్రేవ్ తెలిపారు. దీని గురించి విచారణ తర్వాతే అసలు నిజాలు తెలుతాయని పేర్కొన్నారు. అయితే ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే, 2026 టీ20 ప్రపంచ కప్ ప్రారంభానికి కేవలం మూడు వారాల ముందే బాజ్వా కెనడా జాతీయ జట్టు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు.

కెనడా క్రికెట్ జట్టు ప్రస్తుతం క్లిష్ట సమయాన్ని ఎదుర్కొంటోంది. ఆటగాళ్లపై వచ్చిన అవినీతి ఆరోపణలే కాకుండా, జట్టు ఎంపికలో జరిగిన అవకతవకలను వెల్లడించే ఒక టెలిఫోన్ సంభాషణ రికార్డింగ్ కూడా బయటపడింది. ఆ ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. అందులో, జాతీయ జట్టులోకి కొందరు ఆటగాళ్లను పక్కాగా ఎంపిక చేయాలని తనపై ఒత్తిడి వచ్చిందని మాజీ కోచ్ ఖుర్రం చౌహాన్ పేర్కొన్నట్లు అందులో ఉంది. తనపై ఒత్తిడి తెచ్చిన వ్యక్తులు బోర్డులోని సీనియర్ సభ్యులేనని అతను తెలిపాడు.

# హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ ఆశించిన స్థాయిలో లేదు

● హార్దిక్ పాండ్యాపై మనోజ్ తివారీ విమర్శలు

ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా ముంబై ఇండియన్స్ జట్టు వరుస పరాజయాలతో సతమతమవుతోంది. ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో కేవలం ఒకే ఒక్క విజయాన్ని నమోదు చేసిన ముంబై ఇండియన్స్.. పాయింట్ల పట్టికలో అట్టడుగు నుంచి రెండో స్థానంలో ఉంది. గురువారం పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కూడా ఘోరంగా ఓడిపోవడంతో కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం మార్చి 29న కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుపై మాత్రమే ముంబై ఇండియన్స్ విజయం సాధించింది.ముంబై ఇండియన్స్ వైఫల్యాలపై మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ ఘాటుగా స్పందించారు. హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ ఆశించిన స్థాయిలో లేదని.. జట్టును ముందుండి నడిపించడంలో హార్దిక్ విఫలమవుతున్నాడని విమర్శించారు. రోహిత్ శర్మ సారథ్యంలో ముంబై జట్టు 2013 నుంచి 2023 మధ్య 5 ట్రోఫీలను గెలుచుకుందని గుర్తు చేసిన మనోజ్ తివారీ.. రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించడం ద్వారా ఫ్రాంచైజీ పెద్ద అన్యాయం చేసిందని అభిప్రాయపడ్డారు."హార్దిక్ పాండ్యా తనంతట తానుగా కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుని, తిరిగి రోహిత్ శర్మకు పగ్గాలు అప్పగించాలి" అని మనోజ్ తివారీ సూచించారు. గత రెండేళ్లుగా ముంబైకి ట్రోఫీ రాలేదని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఈ ఏడాది కూడా అదే పునరావృతమయ్యేలా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జట్టులో ఐకమత్యం లోపించిందని, కెప్టెన్ నిర్ణయాలు సరిగ్గా లేవని ఆయన కుండబద్దలు కొట్టారు.పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ తీసుకున్న నిర్ణయాలను మనోజ్ తివారీ తప్పుబట్టారు. విధ్వంసకర బ్యాటర్ షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్‌ను కాదని, హార్దిక్ తనను తాను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు ప్రమోట్ చేసుకోవడం వల్ల జట్టు నష్టపోయిందని విమర్శించారు. అలాగే జస్ప్రీత్ బుమ్రాతో మొదటి ఓవర్ వేయించకపోవడం.. ఫామ్‌లో లేని దీపక్ చాహర్‌కు బంతిని ఇవ్వడం వంటి వ్యూహాత్మక లోపాలు ముంబై ఓటమికి కారణమయ్యాయని ఆయన విశ్లేషించారు.



# నా రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొడతాడు

● గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

టీమిండియా స్టార్ క్రికెటర్, గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో అత్యంత కీలక విషయం క్లారిటీ అని వాషింగ్టన్ సుందర్ పేర్కొన్నారు. స్టేడియంలోకి వెళ్లే ముందే ప్రతి ఆటగాడికి తన బాధ్యత ఏంటో.. కెప్టెన్ తన నుంచి ఏం ఆశిస్తున్నాడో గిల్ చాలా స్పష్టంగా వివరిస్తాడని సుందర్ చెప్పుకొచ్చాడు. ఈ విధానం వల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గి, ప్రశాంతంగా తమ సహజసిద్ధమైన ఆటను ఆడగలుగుతున్నారని పేర్కొన్నాడు.భారత క్రికెట్‌లో ప్రస్తుతం సెన్సేషన్‌గా మారిన బీహార్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ గురించి వాషింగ్టన్ సుందర్ గొప్పగా మాట్లాడాడు. టీ20 క్రికెట్‌లో భారత్ తరపున అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా తన పేరిట ఉన్న రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొట్టే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డాడు. వైభవ్ వయసు తక్కువైనా అతని ఆలోచనా విధానం, నైపుణ్యం చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుందని, అతడు భవిష్యత్తులో టీమిండియాకు సుదీర్ఘ కాలం ఆడుతాడని వాషింగ్టన్ సుందర్ ఆశాభావం వ్యక్తం చేశాడు.టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌కు, గుజరాత్ టైటాన్స్ డ్రెస్సింగ్ రూమ్‌కు పెద్దగా తేడా ఏమీ లేదని సుందర్ తెలిపాడు. ఇక్కడ ఆటగాళ్లందరి మధ్య మంచి సమన్వయం ఉందని, జట్టులోని భారతీయ ఆటగాళ్లంతా టీమిండియాలో కూడా కలిసి ఆడిన వారు కావడంతో ఒకరి గురించి ఒకరికి బాగా తెలుసని చెప్పాడు. కేవలం మైదానంలోనే కాకుండా టీమ్ రూమ్‌లో కూడా అందరం కలిసి ఎక్కువ సమయం గడపడం వల్ల ఓ కుటుంబంలా కలిసిపోయామని, ఈ వాతావరణమే గుజరాత్ టైటాన్స్ జట్టును ప్రత్యేకంగా నిలుపుతుందని పేర్కొన్నాడు.కోచ్ ఆశిష్ నెహ్రా గురించి మాట్లాడుతూ.. ఆయనతో కలిసి పనిచేయడం ఎప్పుడూ గొప్ప అనుభూతినిస్తుందని వాషింగ్టన్ సుందర్ తెలిపాడు. గత నాలుగేళ్లుగా గుజరాత్ జట్టుతో నెహ్రాకు ఉన్న అనుబంధం అద్భుతమని, ఆయన ఆటగాళ్ల బలాలు, బలహీనతలను చాలా సులభంగా అర్థం చేసుకుంటారని కొనియాడాడు. ఐపీఎల్ తన జీవితాన్ని మార్చివేసిందని, 2017లో మొదలైన తన ప్రయాణం ఇప్పుడు ఒక దశాబ్దానికి చేరువవుతోందని, సీనియర్ ఆటగాడిగా తన బాధ్యతలను నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నానని వాషింగ్టన్ సుందర్ స్పష్టం చేశాడు.





## ధోనీ ఎప్పుడు రీ-ఎంట్రీ? అభిమానుల్లో ఉత్కంఠ

**ఫిట్‌నెస్ సమస్యలతో దూరం.. 26న గుజరాత్‌తో మ్యాచ్‌కు అవకాశాలు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ తాజా సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ధోనీ దూరంగా ఉండటం ప్రస్తుతం పెద్ద చర్చకు దారితీసింది. ఐకానిక్ ఆటగాడు లేకుండానే జట్టు బరిలోకి దిగుతుండగా, అభిమానుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రారంభంలో విఫలమైన చెన్నై జట్టు ప్రస్తుతం వరుసగా రెండు విజయాలు సాధించి గాడిలో పడింది. ఢిల్లీ, కోల్‌కతా జట్లపై విజయాలు సాధించినప్పటికీ, ధోనీ గైర్హాజరు జట్టులో స్పష్టంగా కనిపిస్తోంది. ధోనీ దూరంగా ఉండటానికి ప్రధాన కారణం ఫిట్‌నెస్ సమస్యలేనని తెలుస్తోంది. కాలి కండరాల గాయంతో బాధపడుతున్న ఆయన నెట్స్‌లో కనిపిస్తున్నప్పటికీ, మ్యాచ్‌కు సిద్ధంగా లేరని సమాచారం. ఈ నేపథ్యంలో అభిమానుల దృష్టి మ్యాచ్ ఫలితాలపై కాకుండా ధోనీ ఎప్పుడు తిరిగి వస్తాడనే అంశంపై నిలిచింది. ఈ సీజన్ ఆయనకు చివరిదై ఉండొచ్చనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ నెల 26న గుజరాత్ టైటాన్స్‌తో జరిగే మ్యాచ్‌లో ధోనీ ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. అంతకుముందు సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై జట్లతో జరిగే మ్యాచ్‌లకు ఆయన దూరంగా ఉండే అవకాశముంది. జట్టు యాజమాన్యం ఆయన గాయం పూర్తిగా నయం కావాలని భావిస్తూ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. గాయం మళ్లీ తీవ్రమవకుండా చూసుకుంటూ, పూర్తి ఫిట్‌నెస్‌తో మైదానంలోకి దింపాలని నిర్ణయించుకుంది. ఇదిలా ఉంటే, నెట్స్‌లో ధోనీ సాధన చేస్తున్న దృశ్యాలు అభిమానుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఆయన త్వరలోనే మైదానంలోకి దిగుతారని చెన్నై అభిమానులు ఎదురుచూస్తున్నారు.



# కోహ్లీని కాదని ప్రదీప్ సాంగ్వాన్‌ను తీసుకున్న ఢిల్లీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంటే ఇప్పుడు ఒక బ్రాండ్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు అతను వెన్నెముక. అయితే, 2008లో జరిగిన మొట్టమొదటి ఐపీఎల్ వేలంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్ (ప్రస్తుత ఢిల్లీ క్యాపిటల్స్) కోహ్లీని కాదని ప్రదీప్ సాంగ్వాన్‌ను ఎంచుకోవడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ఆ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను వెల్లడించాడు. జట్టులో బ్యాటర్లు ఎక్కువగా ఉండటం వల్లే కోహ్లీని తీసుకోలేకపోయామని సెహ్వాగ్ స్పష్టం చేశారు. సెహ్వాగ్ మాటల ప్రకారం.. 2008లో ఢిల్లీ జట్టులో ఓపెనర్లుగా తాను, గౌతమ్ గంభీర్ ఉండేవాళ్లమని, తమ టీమ్‌లోనే శిఖర్ ధావన్, తిలకరత్న దిల్షాన్ కూడా ఉన్నారని గుర్తు చేశాడు. వారు కూడా ఓపెనర్లే అయినప్పటికీ, తాను గంభీర్ ఓపెనింగ్ చేయడం వల్ల వారిని మూడు, ఐదు స్థానాల్లో ఆడించాల్సి వచ్చేదని తెలిపాడు. నాలుగో స్థానంలో మనోజ్ తివారీ ఉండేవాడని, ఇలా టీమ్ మొత్తం టాప్ ఆర్డర్ బ్యాటర్లతో నిండిపోయిందని పేర్కొన్నాడు. ఆ సమయంలో విరాట్ కోహ్లీ కూడా టాప్ ఆర్డర్‌లోనే బ్యాటింగ్ చేసేవాడని, అతన్ని ఎక్కడ ఆడించాలో తమకు అర్థం కాలేదని సెహ్వాగ్ వివరించాడు. జట్టులో బ్యాటింగ్ విభాగం బలంగా ఉన్నా, బౌలింగ్ లో లోటు ఆ సమయంలో కనిపించిందని సెహ్వాగ్ అన్నాడు. విరాట్ కోహ్లీని టీమ్‌లోకి తెచ్చేంత ఖాళీ తమ బ్యాటింగ్ లైన్ అప్‌లో లేదని, తమకు అప్పుడు ఒక మంచి బౌలర్ అవసరం పడిందని తెలిపాడు. అందుకే కోహ్లీని వదిలేసి ఎడమచేతి వాటం పేసర్ ప్రదీప్ సాంగ్వాన్‌ను తీసుకోవాలని నిర్ణయించుకున్నామని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. ఆ వేలంలో ఆర్సీబీ కోహ్లీని కేవలం రూ. 12 లక్షలకే దక్కించుకుంది. ఆ తర్వాత కోహ్లీ చరిత్ర సృష్టించడం అందరికీ తెలిసిందే. ఇక వేలం సమయంలో ఢిల్లీకి సెహ్వాగే కెప్టెన్ గా ఉండి, జట్టు మేనేజ్మెంట్ నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. మరోవైపు గత 19 ఏళ్లుగా కోహ్లీ ఒకే జట్టు తరపున ఆడుతుండటం విశేషం. ఢిల్లీ వదులుకున్న కోహ్లీ, బెంగళూరు జట్టుకు ప్రాణప్రదంగా మారాడు. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 272 మ్యాచ్‌లు ఆడిన విరాట్ ఏకంగా 8,889 పరుగులు సాధించాడు. ఇందులో 8 సెంచరీలు, 65 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కోహ్లీ రికార్డు నెలకొల్పాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో కూడా కోహ్లీ తన విశ్వరూపం చూపిస్తున్నాడు. ఐదు మ్యాచ్‌ల్లోనే రెండు హాఫ్ సెంచరీలతో కలిపి 228 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో అందరికంటే ముందున్నాడు. ఒకవేళ ఆరోజు ఢిల్లీ కోహ్లీని తీసుకుని ఉంటే, ఆ టీమ్ చరిత్ర మరోలా ఉండేదని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. ఇక ఐపీఎల్ మొదలై 19 ఏళ్లు గడుస్తున్నప్పటికీ గతేడాదే ఆర్సీబీ తొలి టైటిల్ నెగ్గగా, ఢిల్లీ మాత్రం ఇప్పటివరకు రన్నరప్ తో సరిపెట్టుకుంది.



## పరాజయాల మధ్య ఆశావహ దృక్పథం అవసరం: రహానే

**బలగం టీవీ, న్యూఢిల్లీ**


గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమి అనంతరం కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ రహానే తన జట్టు ప్రదర్శనపై స్పందించాడు. వరుస పరాజయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, జట్టులోని సానుకూల అంశాలను గుర్తించాలని పేర్కొన్నారు. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ పరాజయంపై మాట్లాడటం మానసికంగా కష్టమైనప్పటికీ, ఇలాంటి సమయంలో ఆశావహ దృక్పథం అవసరమని అన్నారు. ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన తమ జట్టును కామెరూన్ గ్రీన్ అద్భుత ఇన్నింగ్స్‌తో గట్టెక్కించాడని ప్రశంసించారు. బ్యాటింగ్ ప్రదర్శనపై సంతృప్తి వ్యక్తం చేసిన రహానే, ఒక దశలో 147 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయినా చివరకు 180 పరుగులు సాధించడం మంచి ఫలితమని పేర్కొన్నారు. అయితే బౌలింగ్ విభాగంలో జరిగిన పొరపాట్లే ఓటమికి కారణమని అంగీకరించారు. బౌలర్లు సరైన లెంగ్త్‌లో బంతులు వేయకపోవడం, ఎక్కువగా షార్ట్ పిచ్ బంతులు వేయడం వల్ల ప్రత్యర్థి బ్యాటర్లకు అనుకూలమైందని తెలిపారు. గుజరాత్ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ ప్రదర్శనను ప్రశంసిస్తూ, పవర్‌ప్లేలో వికెట్లు తీయలేకపోవడం జట్టుకు నష్టమైందన్నారు. కామెరూన్ గ్రీన్ బౌలింగ్ చేయకపోవడంపై వివరణ ఇస్తూ, అతను కండరాల నొప్పితో బాధపడుతున్నాడని, అందువల్లే బౌలింగ్‌కు దూరంగా ఉంచామని తెలిపారు.


# సంక్రాంతికి వస్తున్నాం.. నాకెంతో ప్రత్యేకం




విక్టరీ వెంకటేష్ హీరోగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులను సృష్టించడమే కాకుండా తాజాగా ప్రతిష్టాత్మక అవార్డును కూడా సొంతం చేసుకుంది. ముంబైలో జరిగిన ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డుల వేడుకలో అనిల్ రావిపూడి తెలుగు విభాగంలో 'ఉత్తమ దర్శకుడు' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కెరీర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా అత్యంత ప్రత్యేకమైనదని తెలిపాడు. కేవలం రూ.50 కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, పెట్టిన పెట్టుబడికి ఆరు రెట్ల లాభాలను తెచ్చిపెట్టడం ఒక దర్శకుడిగా తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ సినిమాకు కమర్షియల్ సక్సెస్‌తో పాటు విమర్శకుల ప్రశంసలు మరియు జాతీయ స్థాయి అవార్డు దక్కడం పట్ల అనిల్ రావిపూడి హర్షం వ్యక్తం చేశారు.

# అల్లు అర్జున్ రాకాలో షారూఖ్ ఖాన్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ కమర్షియల్ డైరెక్టర్ అట్లీ కలయికలో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రాకా' పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ అంచనాలను మరింత పెంచుతూ తాజాగా ఒక బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అట్లీ ఇప్పటికే షారుఖ్‌తో 'జవాన్' వంటి భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. అదే చొరవతో 'రాకా'లో ఒక కీలకమైన అతిథి పాత్ర కోసం షారుఖ్‌ను అడిగారని, అందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. అల్లు అర్జున్ స్టైలిష్ యాక్షన్, అట్లీ టేకింగ్, దానికి తోడు షారుఖ్ ఖాన్ చరిష్మా తోడైతే ఈ చిత్రం గ్లోబల్ లెవల్‌లో రికార్డులు సృష్టించడం ఖాయమని మేకర్స్ భావిస్తున్నారు. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# టీవీ చుట్టూ అల్లిన పల్లెటూరి కథ




టీవీలు అప్పుడప్పుడే ఊళ్లలోకి ప్రవేశిస్తున్న 90వ దశకం నేపథ్యంలో తిమ్మరాజుపల్లి అనే పల్లెటూళ్లో జరిగే కథ ఇది. శివరాత్రి వచ్చిందంటే ఊరి వాళ్లంతా కలిసికట్టుగా చందాలేసుకుని పండగ ఘనంగా జరిపించడం.. ఆ సాయంత్రం అద్దెకి తెచ్చుకున్న టీవీలో కొత్త సినిమాలు చూసి ఆనందించడం పరిపాటి. అలాంటి ఊళ్లోకి తొలిసారి సొంతంగా ఓ టీవీ కొనుక్కుని తెచ్చుకుంటాడు రాజప్ప (ప్రదీప్ కొట్టె). ఎప్పుడైతే ఆ ఇంట్లోకి టీవీ వచ్చిందో.. అప్పటి నుంచి ఊరి వాళ్ల బుల్లితెర వినోదాలకు రాజప్ప ఇల్లు చిరునామాగా మారిపోతుంది. ఆ ఊళ్లో చిల్లర దొంగతనాలు చేస్తూ గడిపేసే సతీష్ (సాయితేజ్) కూడా టీవీ చూడటానికని వచ్చి.. రాజప్ప చెల్లి శారద (వేద జలంధర్)తో ప్రేమాయణం సాగిస్తుంటాడు. ఓసారి ఈ ప్రేమ విషయం రాజప్పకి తెలియడంతో పెద్ద గొడవ జరుగుతుంది. సతీష్‌ని తీవ్రంగా అవమానించడంతో.. 'ఏ టీవీని చూసైతే విర్రవీగుతున్నావో దాన్ని లేకుండా చేస్తాన'ని సవాల్ విసురుతాడు. సరిగ్గా అదే రాత్రి రాజప్ప ఇంట్లో టీవీ దొంగతనం జరగడంతో ఆ నింద సతీష్‌పై పడుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? నిజంగా ఆ టీవీని ఎవరెత్తుకెళ్లారు?




తనపై నింద తప్పని నిరూపించుకునేందుకు సతీష్ ఏం చేశాడు? ఊరి పెద్దలిచ్చిన రెండు వారాల గడువు లోపల ఆ టీవీని.. అసలు దొంగల్ని తను కనిపెట్టాడా? లేదా?

ఈక్రమంలో తనకెదురైన సవాళ్లేంటి? అన్నది మిగిలిన కథ. ఇప్పుడు అరచేతిలోకి వినోదాలు వచ్చేశాక టీవీ ప్రాధాన్యం ఎవరికీ పెద్దగా తెలియట్లేదు కానీ.. 80-90ల తరానికి టీవీ అంటే ఓ ఎమోషన్. బుల్లితెరతో పెనవేసుకున్న అనుబంధాలు.. దాని చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలు బోలెడన్ని. ఈ 'తిమ్మరాజుపల్లి టీవీ'తో ఆ జ్ఞాపకాల్ని.. ఆ అనుబంధాల్ని మరోసారి గుర్తు చేసే ప్రయత్నం చేశాడు దర్శకుడు మునిరాజ్. మలయాళ సినిమాల్లోలా చాలా సింపుల్ లైన్‌పై నడిచే చిత్రమిది. ఈ కథ ప్రధానంగా ఓ టీవీ దొంగతనం చుట్టూ తిరుగుతుంటుంది. సింగిల్ లైన్ కథలతో ప్రేక్షకుల్ని రెండు గంటల పాటు థియేటర్లలో కూర్చోబెట్టడం అంత తేలికేం కాదు. కథలో బలమైన డ్రామా పండినప్పుడే అది సాధ్యం. ఈ విషయంలో 'తిమ్మరాజుపల్లి టీవీ' పాసైంది. దర్శకుడు ఈ కథకి ఎలాంటి కమర్షియల్ హంగులు జోడించకుండా చాలా నిజాయితీగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఆ ఊరివాళ్ల మనస్తత్వాల్ని.. అక్కడి సంస్కృతి, సంప్రదాయాల్ని పరిచయం చేస్తూ కథని ఆరంభించిన తీరు బాగుంటుంది. నాయకానాయికల ప్రేమకథ ఎప్పుడైతే రాజప్పకి తెలుస్తుందో.. అక్కడి నుంచి కథలో సంఘర్షణ మొదలవుతుంది. ఇక తన ఇంట్లో టీవీ దొంగతనానికి గురైనప్పటి నుంచి కథ మరింత రసవత్తరంగా మారుతుంది. ఈక్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ఫర్వాలేదనిపిస్తాయి. తెరపై కనిపించేదంతా కొత్త వా÷-లశైనా ప్రేక్షకులకు అదెక్కడా ఇబ్బందిగా అనిపించదు. నాయకానాయికలతో పాటు తెరపై కనిపించే ప్రతి పాత్రా సహజమైన నటనతో గుర్తుండిపోతుంది. ఎల్లమ్మ పాత్రతో ఇచ్చిన ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. దర్శకుడు తాను అనుకున్న కథని నిజాయితీగా చెప్పడంలో విజయం సాధించాడు. దీన్ని పూర్తిగా ఓ ప్లలెటూరిలోనే చాలా సహజంగా తెరకెక్కించారు. కిరణ్ అబ్బవరం నిర్మాతగా తొలి ప్రయత్నంలో చాలా తక్కువ బడ్జెట్‌లో ఆహ్లాదభరితమైన సినిమా చూపించగలిగారు. పాటలన్నీ కథలో భాగంగా ఉన్నాయి. నేపథ్య సంగీతం సినిమాకి మంచి ఫీల్‌ని జోడించింది. విజువల్స్ ఆకర్షణగా నిలుస్తాయి.



# త్రివిక్రమ్‌తో ఎన్టీఆర్ మరో సినిమా

ఎన్టీఆర్ వరుసగా భారీ ప్రాజెక్టులతో తన ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న తారక్, తన తదుపరి చిత్రాన్ని మాటల మాంత్రికుడు శ్రీనివాస్‌తో చేయనున్న విషయం తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అరవింద సమేత వీర రాఘవ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింతగా పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఆధ్యాత్మికత, కమర్షియల్ ఎలిమెంట్స్ మేళవింపుతో కూడిన విభిన్న కథాంశంతో తెరకెక్కనుంది. ముఖ్యంగా కుమారస్వామి నేపథ్యం ఉండబోతుందని, విజువల్ వండర్‌గా మలచడానికి త్రివిక్రమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర అంశం టైటిల్. సోషల్ మీడియాలో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. టైటిల్‌ను బట్టి చూస్తే, ఈసారి ఎన్టీఆర్‌ను మరింత ఉగ్రరూపంలో, శక్తివంతమైన పాత్రలో చూపించే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ రెండు సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ రావొచ్చని ఫిలింనగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఒకే రోజు త్రివిక్రమ్ ప్రాజెక్ట్ అధికారిక ప్రకటనతో పాటు, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' నుంచి కూడా అప్డేట్ వచ్చే అవకాశం ఉందట. ఈ డబుల్ అనౌన్స్‌మెంట్స్ ఎన్టీఆర్ అభిమానులకు నిజమైన పండుగలా మారనుండడం ఖాయం. ఒకవైపు భారీ యాక్షన్ డ్రామా,



మరోవైపు ఆధ్యాత్మిక బ్యాక్‌డ్రాప్‌లో విజువల్ గ్రాండియర్ ఇలా రెండు విభిన్న జానర్లలో సినిమాలు చేయడం ద్వారా తారక్ తన గ్లోబల్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేస్తున్నాడు. మొత్తంగా ఎన్టీఆర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నాడని చెప్పాలి. వరుసగా భారీ ప్రాజెక్టులు, స్టార్ డైరెక్టర్లతో కాంబినేషన్లు, విభిన్న కథలు అన్నీ కలిసి టాలీవుడ్‌లో మరో సెన్సేషన్ సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక ఈ సినిమాలు ప్రేక్షకులను ఎలా అలరిస్తాయో చూడాలి.


# స్వయంభూ నుంచి రారా ధీవర పాట ప్రోమో విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీ ర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వ యంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్ర యాణాన్ని ప్రారంభించేం దుకు సిద్ధమైంది చిత్రయూనిట్. ఇందు లో భాగంగా ఈ సినిమాలోని మొద టి పాట'రా రా ధీవర' పాటకి సంబంధిం చిన ప్రోమోను విడు దల చేసింది. దీనికి సంబంధిం చిన ఫుల్ పాటను ఈరోజు సాయంత్రం 6.03 గం టలకు విడుదల చేయ బోతున్నట్లు తెలి పింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధం గా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టు కోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తు న్నారు. భరత్ కృష్ణమాచారి దర్శక త్వం లో పిక్సెల్ స్టూడియో స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీ నన్,నభా నటేష్ హీరో యిన్లుగా నటిస్తు న్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నా రు. ఈ వేసవిలో 'స్వయం భూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.




# చిరాగ్ పాశ్వాన్‌తో ఎలాంటి రిలేషన్ లేదు

## క్లారిటీ ఇచ్చిన నటి కంగనా రనౌత్



కంగనా రనౌత్, చిరాగ్ పాశ్వాన్ ఆ ఇద్దరూ ఇప్పుడు ఫుల్ బిజీ అయ్యా రు. పబ్లిక్ ఈవెంట్స్‌లో తరుచూ కనిపిస్తు న్నారు. దీంతో కొందరు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఆ ఎంపీలు ఇద్దరూ రొమా ంటిక్ రిలేషన్‌లో ఉన్నారా అన్న అను మానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేప థ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫిల్మ్ స్టార్ , ఎంపీ కంగనా రనౌత్ క్లారిటీ ఇచ్చారు. ఆ రూమర్స్‌కు ఆమె చెక్ పెట్టారు. చిరాగ్ పాశ్వాన్ కేవలం ఫ్రెండ్ మాత్రమే అని ఆమె చెప్పారు. తమ మధ్య రొమాన్స్ లేదని కంగనా పేర్కొన్నది. తమ మధ్య చాన్నాళ్ల పరియం ఉందని, పదేళ్ల క్రితం ఇద్దరం కలిసి సినిమా తీశామని, ఒకవేళ తమ మధ్య ప్రేమాయణం సాగి ఉంటే, మాకు పిల్లలు పుట్టేవారని కంగనా రనౌత్ పేర్కొన్నది. పాశ్వాన్‌తో తన రిలేషన్ చాన్నాళ్ల నుంచి అలాగే ఉందన్నారు. ఒకవేళ తనకు రొమాన్స్ కావాలనుకుంటే, అది జరిగేదని, కానీ అలాంటిది ఏమీ లేదని, అది కేవలం ఫ్రెండ్లీ పరిచయం మాత్రమే అని, అతను కూడా ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వచ్చాడని, అందుకే తమ మధ్య పరిచయం కాస్త చనువుగా ఉంటుందని ఆమె అన్నారు. 2011లో రిలీజైన మిలే నా మిలే హమ్ చిత్రంలో కంగనా, చిరాగ్ పాశ్వాన్ కలిసి నటించారు. తన్వీర్ ఖాన్ ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఆ తర్వాత ఇద్దరూ రాజకీయాల్లో రాణించారు. కానీ కంగనా అడపాదడపా చిత్రాల్లో నటిస్తోంది. చివరిసారి ఆమె ఎమర్జెన్సీ చిత్రంలో యాక్ట్ చేశారు.